జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

రంగారెడ్డి గురువారం 20 ఆగస్టు 2026 సంపుటి : 17 సంచిక :31 పేజీలు : 8 వెల : 1/- RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# దౌర్జన్యకాండ...

- సనత్‌నగర్ టిమ్స్ సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలపై పోలీసు జులుం
- మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని, సబిత, ఇతర నాయకుల హౌస్ అరెస్ట్
- ఆస్పత్రి నిర్వహణలో డొల్లతనం బయటపడుతుందనే భయం
- మండిపడ్డ హరీశ్‌రావు, తలసాని

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ సర్కార్ పోలీసుల సాయంతో దౌర్జన్యకాండకు దిగింది. ఆస్పత్రి నిర్వహణలోని డొల్లతనం, తమ క్రెడిట్ చోరీ వ్యవహారం ఎక్కడ బయటపడుతుందో అనే భయంతో రేవంత్ సర్కార్.. మాజీ మంత్రులు, హరీశ్‌రావు, తలసాని, సబితారెడ్డి తదితర ముఖ్య నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయించింది. ఈ క్రమంలో పోలీసులు, హరీశ్‌రావుకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ హయాంలోనే టిమ్స్‌కు సంబంధించి 80శాతం పనులు పూర్తిచేశామని.. ఇటీవల రేవంత్ రెడ్డి కేవలం రిబ్బన్ కటింగ్ చేసి ఆస్పత్రిని తామే నిర్మించామంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. అక్రమ నిర్బంధాలతో బీఆర్ఎస్ గొంతునొక్కలేరని.. ప్రజా సమస్యలపై నిరతరం పోరాడుతూనే ఉంటామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రి నిర్వహణలోని డొల్లతనం ఎకడ బయటపడిపోతుందోనన్న భయంతో రేవంత్ రెడ్డి ప్రభు త్వం అప్రజాస్వామిక చర్యలకు దిగింది. సనత్‌నగర్ టిమ్స్ దవాఖానా సందర్శనకు వెళ్లేందుకు సిద్ధమైన మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ముఖ్య నేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. బుధవారం ఉదయం నుంచే బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు (కోకాపేట్ నివాసం), శ్రీనగర్ కాలనీలోని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని, జూబ్లీహిల్స్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కంటోన్మెంట్‌లో మన్నె క్రిశాంక్, ఇతర ముఖ్య నేతల ఇళ్ల వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నా రు. నాయకులు బయటకు రాకుండా ఇళ్ల పరిసరాలను దిగ్బంధించి, హౌస్ అరెస్టు చేశారు.





## ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

- బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడొద్దు.. హిజ్రాలకు మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి సూచన
- డబ్బుల కోసం ఒత్తిడి చేస్తే చట్టపరమైన చర్యలు
- శుభకార్యాల్లో నిర్వాహకులకు ఇబ్బందులు కలిగించొద్దు
- బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు
- సమస్యలు ఉంటే ఘర్షణలకు దిగకుండా పోలీసులను ఆశ్రయించాలి



## అమెజాన్ సహకారంతో పెద్దవీడు గ్రామంలో విద్యాభివృద్ధికి బాటలు

షాబాద్ మండల కేంద్రంలోని పెద్దవీడు గ్రామపంచాయతీలో విద్యా రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అమెజాన్ సంస్థ తరపున పాఠశాల భవనం, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.





- స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు..!
- ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులకు ఇబ్బందులు
- ఆక్రమణల తొలగింపుతో సమస్య పరిష్కారం.!
- ఆదిభట్ల సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి రంగనాథ్

## రోడ్డు ఆక్రమణలపై అధికారుల ఉక్కుపాదం

మంగళ్‌పల్లిలో ప్రధాన రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని, సాగర్ హైవే మంగళ్‌పల్లి చౌరస్తా నుంచి కొంగరకలాన్ కలెక్టరేట్ వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా కొందరు వ్యాపారులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో, ఈ యొక్క ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారి రఘునాథ్, తన బృందంతో బుధవారం తొలగించారు.

## భారతీయ స్టేట్ బ్యాంక్ అమరావతి స్థానిక ప్రధాన కార్యాలయం,







# రోడ్డు ఆక్రమణలపై అధికారుల ఉక్కుపాదం.

**స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు..!**

**ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులకు ఇబ్బందులు**

**ఆక్రమణల తొలగింపుతో సమస్య పరిష్కారం.!**

**ఆదిభట్ల సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి రంగనాథ్**



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 19 ప్రజా జ్యోతి:** మంగళ్‌పల్లిలో ప్రధాన రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని, సాగర్ హైవే మంగళ్‌పల్లి చౌరస్తా నుంచి కొంగరకలాన్ కలెక్టరేట్ వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా కొందరు వ్యాపారులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో, ఈ యొక్క ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారి రఘునాథ్, తన బృందంతో బుధవారం తొలగించారు.

**స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు..**

రహదారిపై ఆక్రమణల కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతూ విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఈ చర్యలు చేపట్టారు.ఆక్రమణల తొలగింపు సందర్భంగా కొంతమంది స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చినప్పటికీ అధికారులు వెనక్కి తగ్గకుండా కూల్చివేతలను కొనసాగించారు. రహదారులపై ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే విధంగా రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు ప్రజల వినియోగానికే ఉండేలా ఆక్రమణలపై నిరంతరం చర్యలు చేపడతామని తెలిపారు.

**అందరికీ ఒకేలా న్యాయం జరగాలి.**

రహదారిపై ఉన్న ఆక్రమణలను తొలగించడాన్ని స్థానికులు, దుకాణ యజమానులు తీవ్రంగా వ్యతిరేకించారు. రోడ్డుకు ఇరువైపులా అన్ని దుకాణ సముదాయాల ముందు ఉన్న ఆక్రమణలను తొలగించాలని వారు కోరుతున్నారు. కొందరి దుకాణాల ముందు మాత్రమే ఆక్రమణలు తొలగిస్తున్నారని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న అన్ని అక్రమ నిర్మాణాలపై సమానంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

**బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడొద్దు.. హిజ్రాలకు మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి సూచన**

**డబ్బుల కోసం ఒత్తిడి చేస్తే చట్టపరమైన చర్యలు**

**శుభకార్యాల్లో నిర్వాహకులకు ఇబ్బందులు కలిగించొద్దు**

**బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు**

**సమస్యలు ఉంటే ఘర్షణలకు దిగకుండా పోలీసులను ఆశ్రయించాలి**



**ఉప్పల్,ఆగస్టు19,ప్రజాజ్యోతి :** సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ, పరస్పర సహకారంతో జీవించాలని, ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి హెచ్చరించారు ప్రజలను బెదిరించడం, డబ్బుల కోసం ఒత్తిడి చేయడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.మంగళవారం పీర్జాదిగూడ ప్రాంతంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై దాడి జరిగినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ నేపథ్యంలో మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో సీఐ జలంధర్ రెడ్డి ఆధ్వర్యం లో హిజ్రాలకు సామాజిక అంశాలు, చట్టపరమైన బాధ్యతల పై కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మేడిపల్లి సీఐ జలెంధర్ రెడ్డి మాట్లాడుతూ.... హిజ్రాలు సమాజం లో అందరితో సమానంగా గౌరవప్రదంగా జీవించేందుకు హక్కు ఉందని, అయితే జీవనోపాధి కోసం చేసే కార్యక్రమాల్లో భాగంగా ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం లేదా గొడవలకు దిగడం సరికాదన్నారు ఎక్కడపడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా శుభకార్యాలు, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాల సమయంలో నిర్వాహకులను ఇబ్బందులకు గురిచేయకుండా సహకరించాలని సూచించారు. డబ్బుల విషయంలో ఒత్తిడి చేయడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, ఘర్షణలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఏవైనా సమస్య లు లేదా వివాదాలు ఎదురైతే నేరుగా ఘర్షణలకు దిగకుండా పోలీసులను సంప్రదించాలని సీఐ సూచించారు.పోలీసుల సూచనలను పాటిస్తూ చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. సమాజంలో అందరూ పరస్పరం గౌరవించుకుంటూ, చట్టాన్ని గౌరవించి సహకారం తో ముందుకు సాగితే హిజ్రాలకు సమాజంలో మరింత గౌరవప్రదమైన గుర్తింపు లభిస్తుందని సీఐ జలంధర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి పోలీసు సిబ్బంది, పలువురు హిజ్రాలు పాల్గొన్నారు.

# కుషాయిగూడ, రాధికా ఎక్స్ రోడ్స్ వద్ద రెండు ఫ్లైఓవర్లు నిర్మించాలి

**ఉప్పల్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్,ఆగస్టు19,(ప్రజాజ్యోతి)** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడ ఎక్స్ రోడ్స్, రాధికా ఎక్స్ రోడ్స్ వద్ద రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు రెండు ఫ్లైఓవర్లను నిర్మించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలవడం జరిగింది. కుషాయిగూడ, రాధికా ఎక్స్ రోడ్స్ ప్రాంతాలు ఈసీఐఎల్, కీసర, నాగారం తదితర ప్రాంతాలకు ప్రధాన అనుసంధాన కేంద్రాలుగా ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, పెరుగుతున్న నివాస ప్రాంతాలు, భారీగా పెరిగిన వాహనాల రాకపోకల కారణంగా ఈ రెండు ప్రధాన కూడళ్ల వద్ద ప్రతిరోజూ తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని దీనివల్ల సమయం, ఇంధనం వృథా కావడంతో పాటు వాయు, శబ్ద కాలుష్యం పెరుగుతోందని పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రమాదాల అవకాశాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కుషాయిగూడ ఎక్స్ రోడ్స్ వద్ద ఒక ఫ్లైఓవర్, రాధికా ఎక్స్ రోడ్స్ వద్ద మరో ఫ్లైఓవర్ నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కోరారు.ఈ రెండు ఫ్లైఓవర్ల నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సాఫీగా సాగడంతో పాటు ప్రమాదాలు తగ్గుతాయని, కీసర,నాగారం, కుషాయిగూడ, ఈసీఐఎల్ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల దీర్ఘకాలిక రవాణా సమస్యకు పరిష్కారం చూపే ఈ రెండు కీలక ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, త్వరితగతిన మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు - అర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు రాపోలు ఉపేందర్ సవాల్

**వజ్రేష్ యాదవ్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాల్సిందే - కాంగ్రెస్ నేత డిమాండ్**

**మేడిపల్లి (ప్రజా జ్యోతి) :** బహుజనత్వాన్ని విడనాడి దొరల గడీలో బానిసగా మారిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అర్ఎస్ ప్రవీణ్ కుమార్... ఆయన నోటికి అడ్డూఅదుపు లేకుండా మాట్లాడే ముందు కాస్త వాస్తవాలు తెలుసుకోవాలని బోడుప్పల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాపోలు ఉపేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఒక సమావేశంలో అర్ఎస్ ప్రవీణ్ కుమార్... మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు అనీల్ రెడ్డి, అంజిరెడ్డిలపై ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధార ఆరోపణలు గుప్పించడాన్ని ఉపేందర్ తీవ్రంగా తప్పుబట్టారు. గత మూడు దశాబ్దాలుగా ఈ నియోజకవర్గంలో ప్రజా సేవలో నిమగ్నమైన వజ్రేష్ యాదవ్‌పై చౌకబారు, స్థాయి లేని విమర్శలు చేయడం అర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఏమాత్రం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక వ్యక్తి గురించి బహిరంగంగా మాట్లాడే ముందు ఆ వ్యక్తి నేపథ్యం, చరిత్ర గురించి కనీస అవగాహన ఉండాలని, అలా కాకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును బట్టీపట్టి చదవడం ఆయన స్థాయికి తగినదేనా అని రాపోలు ఉపేందర్ నిలదీశారు. బహుజన సంక్షేమం కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే వ్యక్తి, పైసా చెల్లుబాటు లేని ఆరోపణలతో ఒక సీనియర్ నేతను కించపరచడం సిగ్గుచేటని విమర్శించారు. ఇక అసలు విషయానికి వస్తే – ఆ రోజు వేదికపై అర్ఎస్ ప్రవీణ్ కుమార్ పక్కనే కూర్చున్న మాజీ మంత్రి మల్లారెడ్డి భూ కబ్జాల గురించి మాట్లాడే ధైర్యం, దమ్ము ఆయనకు ఉందా అని రాపోలు ఉపేందర్ నేరుగా ప్రశ్నించారు. ఇతరులపై బురద జల్లే ముందు తన పక్కన కూర్చున్న నేతల నిజస్వరూపాన్ని ఎండగట్టే సాహసం చేయగలడా అని సూటిగా సవాలు విసిరారు.



ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరించడం ఆయన రాజకీయ నిజాయితీనే ప్రశ్నార్థకంగా మారుస్తుందని ఆక్షేపించారు. చివరగా, ఇప్పటికైనా అర్ఎస్ ప్రవీణ్ కుమార్ అసలు నిజాలు తెలుసుకుని, తాను చేసిన నిరాధార ఆరోపణలను వెనక్కి తీసుకుని వజ్రేష్ యాదవ్‌కు బహిరంగంగా, బేషరతుగా క్షమాపణ చెప్పాలని రాపోలు ఉపేందర్ గట్టిగా డిమాండ్ చేశారు.

# ముత్యాలమ్మ దేవాలయంలో ఘనంగా అన్నదానం

**బోనాల సందర్భంగా భక్తులు సమర్పించిన ఒడి బియ్యంతో అన్నదాన కార్యక్రమం**



**బోయినపల్లి, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** బాపూజీనగర్‌లోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. బోనాల జాతర సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తూ సమర్పించిన ఒడి బియ్యంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దుర్గయ్య, ప్రేమ్ ముదిరాజ్, అజిత్, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# టోగ్రఫీ.. ఓ అద్భుత కళ

**ఫోటోగ్రఫీతో సమాజంలో ప్రత్యేక గుర్తింపు**

**ఎమ్మెల్యే కాలే యాదయ్య**





**చేవెళ్ల, ఆగస్టు 19(ప్రజా జ్యోతి):** ఫోటోగ్రఫీ కేవలం వ్యాపకం కాదని.. సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టే అద్భుతమైన కళ అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోటో వీడియో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ఫోటో వీడియో గ్రాఫర్ల సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో చోటుచేసుకునే విభిన్న సంఘటనలు, శుభకార్యాలు, ప్రకృతి అందాలను కెమెరా కంటితో బంధించి భవిష్యత్ తరాలకు అందిస్తున్న ఘనత ఫొటోగ్రాఫర్లకే దక్కుతుందన్నారు. ఒక్క ఫొటో ఎన్నో విషయాలను కళ్లకు కట్టినట్లు చూపించగలదని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినా ఫొటోగ్రఫీకి ఉన్న ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదన్నారు. వార్తలకు, ప్రజల జ్ఞాపకాలకు ప్రాణం పోస్తూ నిరంతరం శ్రమిస్తున్న ఫొటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల పిఏసిఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ముడిమ్యాల పిఏసిఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, సీనియర్ నేత జనార్దన్ రెడ్డి, మాజీ డిసిసి ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు ధవల్గారి గోపాల్ రెడ్డి, మంగలి కళ్యాణి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, కృష్ణా నాయక్, యాదిరెడ్డి, శంకర్, ఫొటోగ్రాఫర్లు యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వన్ వార్డ్ ఎవరీ డే సుభాష్ నగర్ వార్డులో పౌర సమస్యలను సమీక్షించిన కమిషనర్

**సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజన ఐఏఎస్**



**శేరిలింగంపల్లి,ఆగస్టు19 (ప్రజాజ్యోతి):** సైబరాబాద్ వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్,జోనల్ కమిషనర్,డిప్యూటీ కమిషనర్,సంబంధిత శాఖల అధికారులతో కలిసి సుభాష్ నగర్ వార్డును సందర్శించి,రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై స్థానిక పౌర సమస్యలు,అవసరాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రజలు ప్రధానంగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో,దెబ్బతిన్న,మరమ్మతులు అవసరమైన రోడ్లు,పార్కుల అభివృద్ధి, పారిశుధ్యం,నిర్మాణ కూల్చివేత,వ్యర్థాల తొలగింపు, అలాగే దోమల నియంత్రణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ వంటి అంశాలను ప్రస్తావించారు.ప్రజలు ప్రస్తావించిన సమస్యలను అవసరమైన తదుపరి చర్యల కోసం సర్కిల్ అధికారులు నమోదు చేశారు.సమస్యలను సమీక్షించిన కమిషనర్,వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ,గుర్తించిన సమస్యల పురోగతిని పర్యవేక్షించి సకాలంలో తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.వన్ వార్డ్ ఎవరీ డే" కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై, వార్డు స్థాయి పౌర సమస్యలపై ప్రాధాన్యతతో చర్యలు చేపడుతున్నారు.

# వినాయక మండప మరమ్మతులు అడ్డుకోవడం సరికాదు

## వైఎం తాండ మాజీ సర్పంచ్ రమేష్ నాయక్

**కొత్తూరు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** కొత్తూరు మండల పరిధిలోని వైఎం తాండలో వినాయక మండపం మరమ్మతులను అడ్డుకోవడం సరికాదని వైయం తాండ మాజీ సర్పంచ్ రమేష్ నాయక్ అన్నారు.తాండలో మరమ్మత్తులు చేస్తున్న వినాయక మండపాన్ని సర్పంచ్ అడ్డుకోవడంతో మాజీ సర్పంచ్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా అక్కడే వినాయకుని ప్రతిష్టింప చేస్తున్నామని చెప్పారు. అయితే మండపం హైట్ తక్కువగా ఉండడంతో పైన రేకులు తీసి హైట్ పెంచాలని నిర్ణయించామన్నారు.అయితే ఈ మరమ్మతులను సర్పంచ్ అడ్డుకుంటున్నాడని విమర్శించారు.తాము వినాయక లడ్డూ వేలంలో వచ్చిన డబ్బులతో మండపం మరమ్మత్తులు చేస్తున్నామని అన్నారు.అయితే కేవలం తనను సంప్రదించలేదన్న కారణంతో సర్పంచ్ గోవింద్ నాయక్ మరమ్మతులను అడ్డుకున్నాడని చెప్పారు.ఏ విధమైనటువంటి మరమ్మత్తులు చేయొద్దని వినాయక మండపానికి పంచాయతీ సెక్రెటరీ చేత నోటీసులు అంటించారని చెప్పారు.దేవుని విషయంలో రాజకీయాలకు



తావు లేదని తాము చేపట్టే మరమ్మత్తులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, యూత్ సభ్యులు, తండావాసులు పాల్గొన్నారు.

నన్ను సంప్రదించకుండానే వినాయక మండపం పై భాగం కూల్చివేశారు.

### సర్పంచ్ గోవింద్ నాయక్

గ్రామ మొదటి పౌరుడు అయిన నన్ను సంప్రదించకుండానే వినాయక మండపంపై భాగాన్ని తీసివేశారని గోవింద్ నాయక్ చెప్పారు.గ్రామంలో అందరినీ కలుపుకొని పోయి మండప నిర్మాణం చేపడతామని చెప్తే మాజీ సర్పంచ్ వర్గం వినడం లేదని విమర్శించారు.ఇది గ్రామానికి సంబంధించిన అంశం కావున గ్రామస్తులందరి నిర్ణయంతో వినాయక మండపం పునర్నిర్మాణం చేద్దామంటే వినడం లేదని చెప్పారు.వినాయక మండపం నిర్మాణానికి తాను వ్యతిరేకం కాదని అయితే అది సర్పంచ్ ఆధ్వర్యంలో జరగాలని తాను కోరుకుంటున్నానని సర్పంచ్ గోవింద్ నాయక్ చెప్పారు.

# వీధి వ్యాపారులకు, దినసరి కూలీలకు యూత్ కాంగ్రెస్ అండ






## కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు

## రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి

## మేరా షహర్, మేర హక్ - మోహనత్కి హాత్ నినాదంతో యూత్ కాంగ్రెస్ శంషాబాద్ లో వాల్ పోస్టర్ విడుదల

రాజేంద్రనగర్, ఆగష్టు 19 (ప్రజా జ్యోతి) వీధి వ్యాపారులకు, దినసరి కూలీలకు యూత్ కాంగ్రెస్ అండగా ఉంటుందని రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు,రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఆదేశాల మేరకు బెటర్ సిటీస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేరా షహర్, మేర హక్ - మోహనత్కి హాత్ నినాదంతో యూత్ కాంగ్రెస్ తలపెట్టిన వాల్ పోస్టర్ ను యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి విడుదల చేశారు. అర్బన్ పాలిటిక్స్ - మేర సహార్ మేర హక్, మెహనత్‌కి హాత్ అనే నినాదంతో జరిగిన ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ లో అర్బన్ ప్రాంతాల్లోని రోజువారి కార్మికుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా కిందివర్గాల సమస్యలపై యువజన కాంగ్రెస్ గలమెత్తింది. సఫాయ్ కార్మికులు, గరేజ్ కార్ఘర్ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఆటో మరియు ఈ రిక్షా డ్రైవర్‌లు , రేడి పత్రి విక్రేతలు, గిగ్ వర్కర్‌లు అర్బన్ రీజియన్ డివిజన్లలో ఈ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు జాతీయ యువజన కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. కార్మికుల హక్కుల కోసం యువజన కాంగ్రెస్ భవిష్యత్తులో కూడ పోరాటాలు చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు చందు యాదవ్, కొత్వాల్ గూడ డివిజన్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, మహేష్ యాదవ్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ భగాయత్ ను అభివృద్ధి చేసే బాధ్యత నాది





## రూ.3.50 కోట్లతో మల్టీ స్పోర్ట్స్ అరేనా ఏర్పాటులి

## త్వరలోనే రూ.35 కోట్లతో ఫుట్ పాత్ ల నిర్మాణం

## ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ మందుమూల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,ఆగస్టు19,ప్రజాజ్యోతి:** ఉప్పల్ భగాయత్ లో సమగ్ర అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఉప్పల్ భగాయత్ అభివృద్ధికి ప్రత్యేక ఫోకస్ పెట్టి కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారం తో భగాయత్ కు కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తూ అభివృద్ధి చేసే బాధ్యత తనదేనన్నారు.ఉప్పల్ భగాయత్ లో నిర్మాణం చేస్తున్న మల్టీ స్పోర్ట్స్ అరేనా ను బుధవారం పరమేశ్వర్ రెడ్డి,కాలనీవాసులు,హెచ్ ఎం డీ ఏ, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. సకల సౌకర్యాలతో క్రీడా ప్రాంగణం మల్టీ స్పోర్ట్స్ అరేనాలో బేబీ పూల్, స్విమ్మింగ్ పూల్, ట్రిపుల్ జంప్, ఎయిర్ రైఫిల్ ఎయిర్ పిస్టల్ సౌకర్యాలతో నిర్మాణం చేరనున్నట్లుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.బహుళ క్రీడా సముదాయం (మల్టీ స్పోర్ట్స్ అరేనా) నిర్మాణంతో ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు రానుందన్నారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టనున్నట్లుగా తెలిపారు.

ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ

నిధులు తెచ్చే బాధ్యత నాది అన్నారు,భగాయత్ లో ఇప్పటికే రూ.వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే రూ.35 కోట్లతో భగాయత్ లో ఫుట్ పాత్ ల నిర్మాణం చేపట్టనున్నట్టుగా చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తుది దశలో ఉన్నట్టుగా చెప్పారు. కార్యక్రమంలో . వక్కంటి శ్రీనివాస్ రావు గారు లి - వాౕఖ ప్రెసిడెంట్ ,బిజ్జుల రవీందర్ రెడ్డి గారు ,వంశీ చంద్ర రెడ్డి, ఈగ సంతోష్,పూజల ప్రభాకర్,విశ్వనాథ్,శివ ప్రసాద్ రావు గారు ,సూర్యగోపాల్, చారి,తుమల దేవి రెడ్డి,లింగంపల్లి రామకృష్ణ,రఫిక్,సల్లా ప్రభాకర్ రెడ్డి,సుంకు శేకర్ రెడ్డి,మంద మురళీకృష్ణ రెడ్డి,మూర్తి,మనోహర్ రెడ్డి.మహేష్, మురళి, రాఘవేంద్ర రెడ్డి,మల్లికార్జున్ ,సందీప్,యాదవల్లి రాజులి,విప్లవ్ రెడ్డి,కిషన్ ముత్యంగారి రవి,శ్రీధర్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,బంగ్ల శ్రీనివాస్ రెడ్డి,శ్రీహరి,సంగమేశ్వర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

# కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

## అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి

## సమయానికి రాని సిబ్బందిపై సీరియస్



**కొత్తూరు ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** కొత్తూరు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అకస్మిక తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని తిరిగి పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అక్కడ అందుతున్న వైద్య సేవలు,పేషెంట్లకు కల్పిస్తున్న సౌకర్యాలు,ఆసుపత్రి నిర్వహణ తీరును పరిశీలించారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఓపి సేవలు,ఐపీ సేవల రికార్డ్స్,ల్యాబ్ రికార్డ్స్,ఐపీ రికార్డ్స్,మెడికల్ ఫార్మసీ పరిశీలించి పేషంట్లని వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆస్పత్రికి టైంకి రాని సిబ్బందిపై సీరియస్ అయ్యారు.అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, పేషెంట్లకు వైద్య సేవల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఆదేశించారు.

# బోడుప్పల్ బోనాలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఆహ్వానం



**మేడిపల్లి (ప్రజా జ్యోతి) :** బోడుప్పల్‌లో జరగనున్న బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కలిసి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో బొమ్మక్ కళ్యాణ్, పొగుల దిలీప్ రెడ్డి, బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సుమన్ భూక్యా, కిరణ్ కుమార్ రెడ్డి, చీరాల నర్సింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్క రాములు, ధనగళ్ల యాదగిరి, గుర్రాల వెంకటేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

## పల్లవి స్కూల్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం





బోయిన్ పల్లి, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి): రహదారి భద్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బోయిన్‌పల్లిలోని పల్లవి స్కూల్‌లో తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-× డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులకు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్లు డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం, లేన్ క్రమశిక్షణ పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, వేగ పరిమితులను పాటించడం, జీబ్రా క్రాసింగ్ వద్ద పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి రహదారి భద్రతా నిబంధనలను వివరించారు.మైనర్లు చట్టబద్ధమైన వయస్సు పూర్తికాకుండా, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటారు వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.కార్యక్రమంలో తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు, పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ట్రాఫిక్ నిబంధనలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తాము నిబంధనలు పాటించడంతో పాటు తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు కూడా పాటించేలా అవగాహన కల్పించాలని పోలీసులు సూచించారు.

# ఇటలీలో సత్తా చాటిన తెలంగాణ సెయిలర్లు



**హైదరాబాద్, ఆగస్ట్ 19 (ప్రజా జ్యోతి) :** ఇటలీలోని లేక్ గార్డాలో జరిగిన అంతర్జాతీయ క్యాడెట్ క్లాస్ అండర్-17 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన ఎనిమిది మంది సెయిలర్లు భారత్‌కు 16 పతకాలు సాధించారని తెలంగాణ సేలింగ్ అసోసియేషన్, యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు సుహైమ్ షేక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సిల్వర్ ఫ్లీట్‌లో చంద్రలేఖ తట్టారి-రిష్విత సుంచన్‌కోట జోడీ రజతం సాధించగా, రవికుమార్ బన్నేఒలు-బద్రినాథ్ నిరుడు జోడీ 8వ, వినోద్ దండు-మణి నిల్కొండ్ల 11వ, కౌనిక్ వర్ధన్-హనుమంత్ వధ్యా 20వ స్థానాల్లో నిలవగా, రవికుమార్ ఒక రేసులో మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఉద్భవ్ స్కూల్ విద్యార్థులు రవికుమార్, చంద్రలేఖ, మణి, నల్లకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థి వినోద్, బన్సీలాల్‌పేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి బద్రినాథ్, గురుకుల విద్యార్థులు రిష్విత, హనుమంత్, కౌనిక్ వర్ధన్ ఈ విజయాన్ని అందించారని పేర్కొన్నారు.

# పరిశోధకులు, రైతులు, ఇతర భాగస్వాముల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు కమ్యూనికేషన్ రోడ్ మ్యాప్ అవసరం

**నార్మ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎం సుందరం**
**వ్యవసాయ-మీడియా సమన్వయం, సహకార సమాచార ప్రసారాన్ని మెరుగుపరచడం అనే అంశంపై నార్మ్ లో వర్క్ షాప్**
**రాజేంద్రనగర్ లోని నార్మ్ లో వర్క్ షాప్ ను ప్రారంభించిన నార్మ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎం సుందరం**






**రాజేంద్రనగర్, ఆగష్టు 19 (ప్రజా జ్యోతి)** పరిశోధకులు, రైతులు, ఇతర భాగస్వాముల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు కమ్యూనికేషన్ రోడ్ మ్యాప్ అవసరం అని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. ఎం. సుందరం పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధనా సంస్థలు మరియు మీడియా మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం, శాస్త్రీయ పరిణామాలను రైతులు మరియు ఇతర భాగస్వాములకు సమర్థవంతంగా చేరవేయడాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (చీూూ=వీ)లో వ్యవసాయ-మీడియా సమన్వయం,సహకార సమాచార ప్రసారాన్ని మెరుగుపరచడం అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. విశ్వసనీయమైన, పారదర్శకమైన మరియు సమయానుకూల సమాచార ప్రసారాన్ని మెరుగుపరచడం, వ్యవసాయం మరియు గ్రామీణాభివృద్ధిపై ప్రజా సమాచార ప్రసారాన్ని బలోపేతం చేయడం, అలాగే సహకారాన్ని మరింత పెంపొందించడంపై మీడియా నిపుణులు, కమ్యూనికేషన్ సిబ్బంది చర్చించేందుకు ఈ వర్క్ షాప్ ఒక ఉమ్మడి వేదికగా నిలిచింది. నార్మ్ డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరం వర్క్ షాప్ ను ప్రారంభించి, పరిశోధకులు, రైతులు, ఇతర భాగస్వాముల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు స్పష్టంగా నిర్వచించబడిన కమ్యూనికేషన్ రోడ్ మ్యాప్ అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతలను సమర్థవంతంగా వ్యాప్తి చేయడం, వ్యవసాయ రంగంలోని ముఖ్యమైన పరిణామాలను ప్రజలకు తెలియజేయడం కోసం శాస్త్రీయ పరిణామాలను సరైన దృక్కోణంలో, సరైన దిశలో కమ్యూనికేట్ చేయడం అత్యంత అవసరమని ఆయన ఉద్ఘాటించారు. వ్యూహాత్మక కమ్యూనికేషన్, పారదర్శకత మరియు నవీనత సమర్థవంతమైన ప్రజా సమాచార ప్రసారానికి కీలకమని డా. సుందరం తెలిపారు. శాస్త్రాన్ని సులభంగా అర్థమయ్యేలా వివరించి, విభాగాల మధ్య ఉన్న గోడలను తొలగించి, శాస్త్రీయ జ్ఞానాన్ని విస్తృత ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకురావాలని కమ్యూనికేషన్ మరియు మీడియా నిపుణులకు ఆయన పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతున్న డిజిటల్ మరియు కృత్రిమ మేధస్సు ఆధారిత మీడియా పరిసరాల్లో ఐసిఎఆర్ సాంకేతికతల ప్రాచుర్యం మరియు చేరువను పెంచేందుకు ఇటువంటి ఫార్మాట్లు సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. నార్మ్ ఎక్స్టెన్షన్ సిస్టమ్స్ మేనేజ్మెంట్ విభాగం అధిపతి డా. వెంకట్ కుమార్, నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ ఎక్స్టెన్షన్ సిస్టమ్ లో మానవ వనరుల సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో అకాడమీ చేపడుతున్న ముఖ్య కార్యక్రమాలు మరియు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఐసిఎఆర్ సైన్స్ కమ్యూనికేషన్ పాలసీ గురించి, సంస్థాగత కమ్యూనికేషన్ను బలోపేతం చేయడంలో దాని ప్రాముఖ్యత గురించి కూడా ఆయన వివరించారు. సమర్థవంతమైన కమ్యూనికేషన్ వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న మీడియా విధానాలు, సమాచార వ్యాప్తి విధానాలు, అలాగే రైతులు మరియు విస్తృత ప్రజానీకం సమాచార అవసరాలను తీర్చడంలో వివిధ భాగస్వాముల పాత్రపై పరస్పర చర్చలు మరియు జ్ఞాన భాగస్వామ్యానికి కూడా ఈ వర్క్షాప్ అవకాశం కల్పించింది. కార్యాచరణలో ఎదురయ్యే అడ్డంకులను గుర్తించడం, వ్యవసాయ పరిశోధనా సంస్థలు మరియు మీడియా ప్రతినిధుల మధ్య వృత్తిపరమైన సహకారాన్ని బలోపేతం చేయడంపై కూడా చర్చలు జరిగాయి. ప్రారంభంలో వర్క్ షాప్ డైరెక్టర్ జి. అనీజ, సిటిఓ నార్మ్ పాల్గొన్నవారికి స్వాగతం పలికి, వర్క్ షాప్ లక్ష్యాలను వివరించారు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు వివిధ మీడియా సంస్థలకు చెందిన ప్రతినిధులు, అగ్రి-బ్యూరో చీఫ్లు, సీనియర్ రిపోర్టర్లు, ప్రజా సంభందాల ఆఫీసర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# రాగం సుజాత యాదవ్ మృతి పట్ల సంతాపం తెలిపిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** తెలంగాణ,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్పర్సన్, ప్రముఖ సామాజిక సేవకురాలు కీ.శే. రాగం సుజాత యాదవ్ స్వర్గస్తులయ్యారని తెలిసి మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు నల్లగండ్లలోని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్వగృహానికి విచ్చేశారు.ఈ సందర్భంగా హరీష్ రావు రాగం నాగేందర్ యాదవ్,కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.రాగం సుజాత యాదవ్ సేవలు చిరస్మరణీయమని అన్నారు.తెలంగాణ ఉద్యమ సమయంలో సుజాత యాదవ్ పాల్గొన్న సభలు, ర్యాలీలకు సంబంధించిన దృశ్యాలను టీవి లో వీక్షించిన హరీష్ రావు,ఆమె తెలంగాణ బిడ్డగా చేసిన సేవలను స్మరించుకుని నివాళు లర్పించారు.రాగం సుజాత యాదవ్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా సాధికారతకు చేసిన సేవలు మరువలేనివని హరీష్ రావు కొనియాడారు. ఆమె మృతి సామాజిక రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పటాన్చెరు బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, పలువురు



మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఇనగంటి ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు

**గురుస్వామి ప్రసాద్‌రావుకు ఘన సన్మానం.. పేదలకు అండగా నిలవాలని పిలుపు**



**బాలానగర్, ఆగష్టు 19 (ప్రజా జ్యోతి) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త, ఎస్వీ కన్స్ట్రక్షన్స్ సంస్థ నిర్వాహకులు, అయ్యప్ప స్వామి భక్తుడు, గురుస్వామి ఇనగంటి ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలను బుధవారం ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్డులోని శ్రీ సాయి జ్యోతి మెడికల్ దుకాణం వద్ద భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్తులు, సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాద్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు గురుస్వామి ఎనగంటి ప్రసాద్‌రావును ఘనంగా సన్మానించి, ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సమితి సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు కలిసి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ధర్మాన్ని పాటిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించాలి జన్మదిన వేడుకల సందర్భంగా ఇనగంటి ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ఫతేనగర్ శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో తన జన్మదిన వేడుకలను అందరూ కలిసి నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటిస్తూ, మానవత్వాన్ని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి తమకు చేతనైనంత సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలిచి, తమ వంతు సహాయాన్ని అందించాలని కోరారు. “మనకు ఉన్నదాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి అందించడం ద్వారా నిజమైన మానవత్వాన్ని చాటుకోవాలి. అందరం కలిసికట్టుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పేదలకు అండగా నిలవాలి” అని ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శ్రీ అయ్యప్ప సేవా సమితి సభ్యుల అభినందనలు ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. గురుస్వామి ఎనగంటి ప్రసాద్‌రావు అయ్యప్ప స్వామిపై భక్తిశ్రద్ధలతో పాటు సేవా కార్యక్రమాల పట్ల కూడా ఎంతో ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టే శక్తిని అయ్యప్ప స్వామి ప్రసాదించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఫతేనగర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు కొట్టం శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వాసుగుప్తా, వడకట్టు శ్రీనివాస్(మెడికల్ ), చిట్టిబాబు,సూర్య కిరణ్, ఆర్ కే రాజు పటేల్, మధు, చిన్న, మధుగుప్తా, పురుషోత్తం, జంషీర్,రత్నం, కోటి, నాగరాజు తదితరులు పాల్గొని గురుస్వామి ఇనగంటి ప్రసాద్‌రావుకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# జోనల్ కమిషనర్ దృష్టికి మేడ్చల్ డివిజన్‌లో రోడ్ల దుస్థితి

**మేడ్చల్, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** మేడ్చల్ 297 డివిజన్ పరిధిలో అధ్వానంగా మారిన రోడ్ల సమస్యను మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత రామన్నగారి మణికంఠ గౌడ్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను జోనల్ కమిషనర్‌తో కలిసి స్వయంగా పరిశీలించి రోడ్ల దుస్థితిని వివరించారు. చాలా ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మణికంఠ గౌడ్ తెలిపారు. చినుకు పడితే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని, గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయని చెప్పారు. రోడ్లు లేని ప్రాంతాల్లో కొత్తగా సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. అదేవిధంగా మేడ్చల్ పెద్ద చెరువు కట్టపై ఉన్న రోడ్డుతో పాటు నిత్యం రద్దీగా ఉండే చెక్‌పోస్ట్ రోడ్డును కూడా పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్ల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ.. మేడ్చల్ డివిజన్ పరిధిలోని రోడ్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జోనల్ కమిషనర్ వెంట మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్ తదితరులు ఉన్నారు.



# ఓటు హక్కును కాపాడటమే లక్ష్యం

**. ఎస్ఐఆర్‌పై బీఎల్ఏలతో ఎమ్మెల్యే శ్రీగణేష్ సమీక్ష**





**బోయిన్ పల్లి, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** కంటోన్మెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియపై ఎమ్మెల్యే శ్రీగణేష్ బూత్ లెవల్ ఏజెంట్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేసిన బీఎల్ఏల సేవలను ఎమ్మెల్యే అభినందించారు.ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ..కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా సాగిందన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి ఓటును కాపాడేందుకు బీఎల్ఏలు ఎంతో కష్టపడి పనిచేశారని, వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.అన్‌మ్యాప్డ్ ఓటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నోటీసులు అందిన ఓటర్ల వివరాలను సకాలంలో సమర్పించేలా చూడాలని బీఎల్ఏలకు సూచించారు. ఒక్క అర్హుడి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ ప్రాథమికంగా పూర్తయినప్పటికీ, మొత్తం ప్రక్రియ తుది దశకు చేరుకునే వరకు నాయకులు, బీఎల్ఏలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.
సమావేశానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దీపక్ జాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కంటోన్మెంట్ ఎస్ఐఆర్ పీసీసీ కో-ఆర్డినేటర్ సత్యారెడ్డి, నియోజకవర్గ ఎస్ఐఆర్ కో-ఆర్డినేటర్లు బద్రినాథ్ యాదవ్, సంకి రవీందర్, వివిధ వార్డుల అధ్యక్షులు, మహిళా నాయకులు, బీఎల్ఏలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గృహిణుల శక్తిని గుర్తించి గౌరవం కల్పించడమే లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్ట్ 19 (ప్రజా జ్యోతి) :** గృహిణుల నిస్వార్థ సేవలు, కనిపించని శ్రమకు గౌరవం కల్పించే లక్ష్యంతో టాటా టీ చక్ర గోల్డ్ ‘ఘనం సోచ్’ పేరుతో కొత్త ప్రచారాన్ని ప్రారంభించిదని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్యాకేజ్డ్ బేవరేజెస్ అండ్ ఆర్గానిక్ ఇండియా ప్రెసిడెంట్ శరత్ వర్మ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ జీతం లేకపోయినా కుటుంబాన్ని



తీర్చిదిద్దడంలో గృహిణుల పాత్ర కీలకమనే సందేశాన్ని ఈ ప్రచారం అందిస్తుందని పేర్కొన్నారు. గృహ రుణం నేపథ్యంలో రూపొందించిన ప్రచార కథనం ద్వారా ‘పని’కి ఉన్న సంప్రదాయ నిర్వచనాన్ని సవాలు చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ తమకు కీలక మార్కెట్ అని, ‘ఘనం టీ, ఘనం ఆలోచనను ప్రేరేపిస్తుంది’ అనే బ్రాండ్ నమ్మకానికి ‘ఘనం సోచ్’ సహజ కొనసాగింపని తెలిపారు. గృహిణుల నిశ్శబ్ద శక్తిని గుర్తించి, వారి కృషికి గౌరవం కల్పించడమే ప్రచారం ఉద్దేశమన్నారు.

# సొంతింటితో పేద కుటుంబానికి భరోసా

**ఎమ్మెల్యే కాలే యాదయ్య**
**దామరగిద్దలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే**





**చేవెళ్ల, ఆగస్టు 19(ప్రజా జ్యోతి):** సొంతిల్లు పేద కుటుంబానికి ఆత్మగౌరవంతో పాటు కొండంత భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్దలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే కాలే యాదయ్య బుధవారం ప్రారంభించారు. నూతన ఇంటిని ప్రారంభించిన అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో యాదయ్య ఆత్మీయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నూతన ఇంటిని సద్వినియోగం చేసుకుని కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, చేవెళ్ల పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ముడిమ్యాల పిఎసిఎస్ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు మధుసూదన్ గుప్తా, మాజీ డిసిసి ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ధవల్గారి గోపాల్ రెడ్డి, తాళ్లపల్లి నర్సింలు, పైండ్ల మధుసూదన్ రెడ్డి, మంగలి కళ్యాణి, కో ఆప్షన్ సభ్యుడు బక్కా రెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్లు పడాల ప్రభాకర్, జంగీర్,మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, శంకర్, అబ్దుల్ ఘని, నరేందర్ గౌడ్, ఖదీర్, రాజు, ఓబిసి మండల అధ్యక్షుడు సూర్యాపేట శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హోమియోపతి విద్యార్థుల దీక్షకు బీజేపీ నాయకుల సంఘీభావం

**ఉప్పల్,ఆగస్టు19,ప్రజాజ్యోతి:** రామంతపూర్ హోమియోపతి విద్యార్థుల దీక్షకు బిజెపి నాయకులు సంఘీభావం తెలిపారు,గత 15 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రిలే నిరాహార దీక్ష చేస్తున్న హోమియోపతి విద్యార్థులకు,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్బీజేపీ సీనియర్ నాయకులు గడ్డం సాయి కిరణ్ సంఘీభావం తెలిపారు. దేశంలోనే అత్యల్ప స్థాయిలో హోమియోపతి విద్యార్థులకు స్టైఫండ్ అందుతుండటం




బాధాకరమని,విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.విద్యార్థుల పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైన స్థాయిలో పోరాటం చేస్తామని బిజెపి నాయకులు తెలిపారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు

# అప్లైడ్ ఏఐతో భారత్‌లో కార్యకలాపాలు విస్తరించనున్న ఫీనామ్

**మరో రెండు వేల మందికి ఉద్యోగావకాశాలు**

**డిసెంబర్ 17న 'ఐయామ్ ఫీనామ్ ఇండియా 2026'**

**శేరిలింగంపల్లి,ఆగస్టు19 (ప్రజాజ్యోతి):** అప్లైడ్ ఏఐ రంగంలో 'ఫీనామ్' సరికొత్త అడుగులు వేస్తుంది. హెచ్ఆర్, వర్క్‌ఫోర్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ కోసం భారతదేశంలో కార్యకలాపాలు విస్తరిస్తుంది. టెక్నాలజీ, ప్రతిభ, ఆవిష్కరణల్లో పెట్టుబడులు పెడుతుంది.తెలంగాణలో తన కార్యాలయాలను విస్తరిస్తూ భవిష్యత్తులో భారత్‌లో రెండు వేలకు పైగా అదనపు ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వివరాలు తెలిపేందుకు బేగంపేటలో ఉన్న ఐటీసీ కాకతీయలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీనామ్ సీఈఓ ఒ కో-ఫౌండర్ మహే బయరెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 17, 2026న హైదరాబాద్‌లోని నోవోటెల్‌లో జరగనున్న 'ఐయామ్ ఫీనామ్ ఇండియా 2026' సదస్సులో కంపెనీ తన భారత వృద్ధి ప్రణాళికలను ప్రధానంగా ప్రదర్శించనుందన్నారు. హెచ్ఆర్, ఐటీ విభాగాల్లో అప్లైడ్ ఏఐ కోసం ప్రత్యేక వేదికగా నిలవనున్న ఈ సదస్సు నియామకాలు, ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి,వారిని సంస్థలో నిలుపుకోవడంలో ఏఐ ఎలాంటి ఫలితాలను అందించగలదో చర్చించేందుకు హెచ్ఆర్ నిపుణులు, టాలెంట్ అక్విజిషన్ లీడర్లు, హెచ్ఆర్‌ఐటీ బృందాలు, ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్‌లను ఒకే వేదికపైకి తీసుకు రానుందన్నారు. ఆయా కంపెనీలు తమ ఉద్యోగులపై చేసే పెట్టుబడులే భవిష్యత్తు పని తీరును (ఫ్యూచర్ ఆఫ్ వర్క్) నిర్దేశిస్తాయని పేర్కొన్నారు. కేవలం ఏఐతో ప్రయోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగుల పని తీరు, అభివృద్ధి, ఎదుగుదలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే దిశగా లీడర్లకు 'ఐయామ్ ఫీనామ్ ఇండియా' మార్గదర్శనం చేస్తుందని తెలిపారు. భారతదేశ సాంకేతిక నైపుణ్యం, అపారమైన ప్రతిభ, ఆకాంక్షలు ఈ మార్పును ముందుండి నడిపించేందుకు శక్తిసామర్థ్యాలను కలిగి ఉన్నాయని చెప్పారు.ఫీనామ్ 2010లో స్థాపించబడింది. గ్రేటర్ ఫిలడెల్ఫియా ప్రధాన కేంద్రంగా పని చేస్తూ కెనడా, భారతదేశం,ఇజ్రాయెల్, నెదర్లాండ్స్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్‌లలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆరు ఖండాల్లోని దాదాపు పన్నెండు దేశాల్లో ఈ సంస్థ ఉద్యోగులు ఉన్నారు. టెక్నాలజీ, హెల్త్‌కేర్,రిటైల్,హాస్పిటాలిటీ, తయారీ, రవాణా,ఫైనాన్స్,ఎనర్జీ, యుటిలిటీస్ రంగాల్లోని 500 కంటే ఎక్కువ అంతర్జాతీయ సంస్థలకు ఫీనామ్ సేవలు అందిస్తోంది.మైక్రోసాఫ్ట్, హనీవెల్, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రముఖ దిగ్గజ సంస్థలు ఫీనామ్ క్లయింట్ల జాబితాలో ఉన్నాయి. ఫీనామ్ భారత కార్యకలాపాలు ప్రధానంగా హైదరాబాద్




ayireddi, CEO & Co-Founder, Phenom; briefing media the highlights of IAMPHENOM India 2026 d AI event dedicated to human resources and IT; organized by Phenom, a Philadelphia based G pplied AI for HR; at a press conference, today at ITC Kakatiya, Hyderabad.

కేంద్రంగా కొనసాగుతున్నాయి. విశాఖపట్నం,బెంగళూరులలో కేంద్రాలు ఉన్నాయి. ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, కస్టమర్ సక్సెస్, సపోర్ట్ వంటి కీలక విభాగాల్లో ఇక్కడి బృందం పని చేస్తోంది. దీంతో అమెరికా వెలుపల సంస్థకు అతిపెద్ద టెక్నాలజీ, టాలెంట్ హబ్‌లలో భారతదేశం ఒకటిగా నిలిచింది. భారత్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్, ఐడీఎఫ్‌సీ, డాక్టర్ రెడ్డీస్, క్యాప్‌జెమిని, పీడబ్ల్యూసీ, ఎన్‌టీటీ డేటా, ఓపెన్‌టెక్స్ట్, ఎలీ లిల్లీ వంటి ప్రముఖ సంస్థలు ఫీనామ్ సేవలను వినియోగిస్తున్నాయి.

# హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉంది

**పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని సందర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**


**కూకట్ పల్లి, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి) :** ?హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకుడు వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి ఎల్లమ్మబండలోని పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను సంఘం నిర్వాహకుల నుంచి అడిగి తెలుసుకున్నారు. తను కూకట్ పల్లి డిప్యూటీ కమిషనర్ గా పని చేసినప్పుడు ఎల్లమ్మబండ కాలనీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు గుర్తు చేశారు. పాలమూరు జిల్లా అంటేనే వలస కార్మికుల జిల్లా అని పేరుంది, ఎల్లమ్మబండతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పాలమూరు వాసులు నివాసం




ఉంటున్నారని అన్నారు. హైదరాబాద్ మహానగర నిర్మాణంలో, అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు వలసలు తగ్గాయి, పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల ద్వారా పుష్కల నీటిని అందించడంతో వలస కార్మికులు వలసల బాట మాని వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. పాలమూరు బిడ్డలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ఏ. కరీమ్, ప్రధాన కార్యదర్శి గోపాస్ రవీందర్, సీనియర్ జర్నలిస్టులు ఆర్. కే. దయాసాగర్, సామల రాము, బిఆర్ఎస్ నాయకులు డి. అనిల్ రెడ్డి, కాంట్రాక్టర్ శంకర్, సంఘం వ్యవస్థాపక సభ్యులు దేవయ్య, యాదగిరి, నరసింహ, మాచర్ల భద్రయ్య, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ స్టేట్ బ్యాంక్ అమరావతి స్థానిక ప్రధాన కార్యాలయం,

హైదరాబాద్‌లో 18.08.2026న నగర రాజభాషా అమలు కమిటీ (బ్యాంకులు ఒ బీమా), హైదరాబాద్ ఆధ్వర్యంలో హిందీ వార్తా వాచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీ చిన్మయ్ కుమార్‌తో పాటు హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.
కార్యక్రమంలో భారతీయ స్టేట్ బ్యాంక్ అమరావతి స్థానిక ప్రధాన కార్యాలయం ముఖ్య మహాప్రబంధకులు శ్రీ రాజేష్ కుమార్ పటేల్, ముఖ్య మహాప్రబంధకులు శ్రీ సుశీల్ కుమార్, మహాప్రబంధకులు శ్రీ ప్రఫుల్ల కుమార్ జెనా, మహాప్రబంధకులు శ్రీ విశాల్ కుమార్ సక్సేనా, మండల అభివృద్ధి అధికారి శ్రీ సుశీల్ కుమార్ హంస్, ఉప మహాప్రబంధకులు (విజిలెన్స్) శ్రీ ఉమేష్ కుమార్ పాల్గొన్నారు. పోటీకి నిర్ణాయక మండలి సభ్యురాలిగా ఆకాశవాణి హైదరాబాద్ సహాయ సంచాలకురాలు (కార్యక్రమాలు) శ్రీమతి సీమా కుమారి హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో మండల అభివృద్ధి అధికారి శ్రీ సుశీల్ కుమార్ హంస్ అందరికీ స్వాగతం పలికారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీ చిన్మయ్ కుమార్, ఉప మహాప్రబంధకురాలు శ్రీమతి మేఘనా సింగ్, ఆకాశవాణి హైదరాబాద్ సహాయ సంచాలకురాలు శ్రీమతి సీమా కుమారిని శాలువా, జ్ఞాపిక, మొక్కలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య మహాప్రబంధకులు శ్రీ సుశీల్ కుమార్ ప్రాంతీయ భాషల ప్రాముఖ్యతను వివరించారు. హిందీ మాట్లాడే సిబ్బంది ప్రాంతీయ భాషలను నేర్చుకోవడానికి ఆసక్తి చూపాలని ఆయన సూచించారు. ముఖ్య మహాప్రబంధకులు శ్రీ రాజేష్ కుమార్ పటేల్ మాట్లాడుతూ, రాజభాష హిందీని సమర్థవంతంగా వినియోగించడాన్ని ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని అన్నారు. బ్యాంకింగ్, బీమా వంటి సేవా రంగాల్లో హిందీని సులభంగా, సరళంగా, ఆచరణాత్మకంగా ఉపయోగించడం ద్వారా ఖాతాదారులతో మెరుగైన సంభాషణను నెలకొల్పవచ్చని తెలిపారు. ఈ దిశగా నగర రాజభాషా అమలు కమిటీ నిర్వహిస్తున్న వివిధ పోటీలు, కార్యక్రమాలు రాజభాష హిందీ ప్రచారానికి ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రాంతీయ డైరెక్టర్ శ్రీ చిన్మయ్ కుమార్ తన ప్రసంగంలో రాజభాష పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. తమ నగర రాజభాషా కమిటీకి భారత ప్రభుత్వం పురస్కారం అందజేస్తోందని ఆయన తెలిపారు. భారతీయ స్టేట్ బ్యాంక్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసించిన శ్రీ చిన్మయ్







కుమార్, పోటీ విజయవంతంగా నిర్వహించబడాలని ఆకాంక్షించారు. సభ్య కార్యాలయాల నుంచి సిబ్బంది ఉత్సాహంగా హిందీ వార్తా వాచన పోటీలో పాల్గొన్నారు. అనంతరం నిర్ణాయక మండలి పోటీ ఫలితాలను ప్రకటించింది. కార్యక్రమాన్ని రాజభాషా విభాగం నిర్వహించగా, కృతజ్ఞతలు తెలియజేయడంతో కార్యక్రమం ముగిసింది

# దేవాలయ భూములను అందరం కలిసి కాపాడుకుందాం.

**భూముల పరిరక్షణ కమిటీ పిలుపు.**

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 19(ప్రజా జ్యోతి )** జగద్గిరిగుట్ట లో వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూములను కాపాడుకుందాం అని కోరుతూ నేడు దేవాలయం వద్ద దేవాలయ భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశం సందర్భంగా జగద్గిరిగుట్టలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన 14 ఎకరాల ఆరు గుంటల ప్రభుత్వ స్థలం నేడు అన్యాక్రాంతమవుతుందని గత కొద్ది సంవత్సరాల నుంచి పోరాడుతున్నప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడం వల్ల ఉన్న స్థలం కూడా కోల్పోయే ప్రమాదం ఉన్నందున జగద్గిరిగుట్ట ప్రజలందరూ కలిసి ఈ స్థలాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సినటువంటి ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులు గాని, రాజకీయ పార్టీల నాయకులు గాని, రెవెన్యూ అధికారులు కానీ కనీసం స్పందించడం లేదని అందుకే ప్రజలందరిని కలుపుకొని ఈ భూముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని అన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తులు ఇచ్చినప్పటికీ వారు చేస్తున్నామని చెప్పి కూల్చకపోవడమనేది రెవెన్యూ అధికారులే ప్రోత్సహిస్తున్నట్టు కనిపిస్తోందని కమిటీ అభిప్రాయపడింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిడిలోకి లొంగకుండా వెంటనే అక్కడ ఏర్పడ్డ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిందిగా డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పినప్పటికీ కలెక్టర్ మరియు ఎమ్మార్వో కు వినతి పత్రం ఇచ్చినప్పటికీ కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమని, కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమో లేక స్వార్థం వల్లో ఆగిన కబ్జాలు మళ్ళీ మొదలయ్యాయని ఇప్పటికైనా వాటిని ఆపకపోతే ప్రజల దృష్టిలో వారు కబ్జాదారులకు సహకరించినట్టేనని భావిస్తారన్నారు. దేవాలయ స్థలాలను కాపాడుకోవడానికి ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలివచ్చి మా



ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. దేవాలయ భూముల పరిరక్షణ కొరకు శనివారం నాడు సంతకాల సేకరణ, ఆదివారం నాడు రిలే నిరాహార దీక్షలు మొదలు చేసి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని దానికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, జనసేన నాయకులు సతీష్, బిజెపి నాయకులు మాధవులు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు రాములు ఏఐటీయుసీ కార్యదర్శి శ్రీనివాస్ కోశాధికారి సదానంద్ ప్రజానాట్య మండల అధ్యక్షులు బాబు తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణం నిలిపివేయాలి

**అధికారులు స్పందించకుంటే ఆందోళన చేపడతాం**

**గూడెం రమేష్**



**చేవెళ్ల, ఆగస్టు 19(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మండలం కుమ్మెరలో అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా మసీదు నిర్మాణానికి పునాదులు వేస్తున్నారని బజరంగ్‌దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ ఆరోపించారు. బుధవారం నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన.. అనుమతులు లేవని గ్రామ కార్యదర్శి కరుణాకర్ స్పష్టం చేసినప్పటికీ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని రమేష్ ఆరోపించారు. వెంటనే నిర్మాణాన్ని నిలిపివేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు స్పందించకపోతే విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మప్రచార్ రాఘవేంద్రచారి, బజరంగ్‌దళ్ కార్యకర్తలు మహేంద్ర, వడ్ల అక్షయ్, మాజీ సర్పంచ్ భానుతేజ, చెన్నోల శ్రీనివాస్, కావలి లక్ష్మీనారాయణ, కావలి కుమార్, బోనగిరి దర్శన్, చంద్రశేఖర్‌రెడ్డి, చాకలి శ్రీకాంత్, కావలి వెంకటేశం, బోధే విష్ణువర్ధన్‌రెడ్డి, బాధే శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 83 గోవా మద్యం బాటిల్ లో పట్టివేత:

**మద్యం బాటిల్లపై కేసు నమోదు**



**శేరిలింగంపల్లి,ఆగస్టు 18 (ప్రజాజ్యోతి):** డిటిఎఫ్ శేరిలింగంపల్లి,ఎస్ హెచ్ ఓ శేరిలింగంపల్లి, పటాన్చెరు ఎక్సైజ్ పోలీసులు టైమ్స్ కలిసి మియాపూర్ ఎక్స్ రోడ్, మాతంగి టోల్ ప్లాజా వద్ద ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో గోవా నుండి కార్లలో ఇతర వాహనాల్లో వస్తున్న 83 మద్యం బాటిల్ లను స్వాధీనం చేసుకున్నారు.పట్టుకున్న మద్యం బాటిల్ల విలువ రూ.1,50,000 గా ఉంటుందని అంచనా వేశారు.మద్యం బాటిళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నట్లు శంషాబాద్ ఈఎస్ రాధాకృష్ణారావు తెలిపారు.

# రామంతాపూర్ డివిజన్ సమస్యపై జోనల్ కమీషనర్ రాధికా గుప్తా తో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి



**ఉప్పల్,ఆగస్టు19(ప్రజాజ్యోతి)** శారదానగర్ ఏడిఆర్ఎం హాస్పిటల్ గల్లీ లో కొత్తగా బీటీ రోడ్ వేసి దాదాపుగా 6నెలలు అవుతుంది రోడ్డు మధ్యలో మ్యాన్ హోల్స్ రోడ్డు కి సమానముగా లేకపోవటం వలన గుంతలుగా ఏర్పడి చాల ప్రమాదాలు జరిగాయి ,వాహనదారులు ఇబ్బందికి గురిఅవుతున్నారు అని ఇట్టి సమస్యపై జోనల్ కమీషనర్ రాధికా గుప్తా దృష్టికి ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి వారి దృష్టికి తీసుకెళ్లారు జోనల్ కమీషనర్ సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంథం నాగేశ్వరరావు పాల్గొన్నారు,

# వైభవంగా దుర్గామాత, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

**ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కాలే యాదయ్య ప్రత్యేక పూజలు**

**చేవెళ్ల, ఆగస్టు 19(ప్రజా జ్యోతి):** చేవెళ్ల మండలం దేవరంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గామాత, శ్రీ పోచమ్మ తల్లి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మనీలా నరహరిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. గ్రామ దేవతల ఆశీస్సులతో దేవరంపల్లి ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించి కృపాకటాక్షాలు పొందాలని సూచించారు. నూతన ఆలయాల నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందుతుందని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపనతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# గాజులరామారం డివిజన్‌లో రూ.79 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్ ఆగష్టు 19(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ గాజులరామారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో రూ.79 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. శ్రీ వెన్ ఎంక్లేవ్‌లో రూ.38 లక్షలు, సరస్వతి ఆర్కేడ్‌లో రూ.20 లక్షలు, మెట్కన్ గూడలో రూ.21 లక్షల నిధులతో మొత్తంగా ఈ పనులను చేపట్టనున్నారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో కోట్లాది రూపాయలతో అంతర్గత డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ అదే తరహాలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.గత పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ప్రజల అవసరాలను పట్టించుకోకుండా నాయకులు కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించుకున్నారని ఆరోపించారు.ఈ ప్రాంతాల అభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ , స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్‌తో పాటు కాలనీ అధ్యక్షులు మరియు సభ్యులు శ్రీధర్ గౌడ్, సోమరాజు, రాజశేఖర్ రెడ్డి, కేశవ రెడ్డి,విజయ్ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సునీల్, భూపాల్ రెడ్డి మరియు కాలనీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ మహాసభను విజయవంతం చేయాలి.

### సెప్టెంబర్ 9న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభ.



**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు19 (ప్రజాజ్యోతి)** ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ ఉద్యమాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై బలమైన ప్రజా పోరాటాలు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు.ఎల్‌బీనగర్ నియోజకవర్గం హయత్‌నగర్ మండల కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్, అనుబంధ విభాగాల నియోజకవర్గ సమావేశం ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర రవీందర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగళ్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, అణగారిన వర్గాల ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. మత దురహంకారం, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని సూచించారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉద్యమకారులపై ఉందన్నారు.దేశంలో కొనసాగుతున్న కుల వ్యవస్థ కారణంగానే మెజారిటీ అణగారిన వర్గాలు పేదరికంలో మగ్గుతున్నాయని ఆయన అన్నారు. పేదరికం, వివక్షకు కారణమవుతున్న కుల వ్యవస్థను రద్దు చేసి దోపిడీ, పీడన, అసమానతలు లేని సమసమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటిపై ప్రజా ఉద్యమాలను నిర్మించాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ నేటి నుండి వివిధ బస్తీలకు డివిజన్లకు వెళ్లి నూతన కమిటీలు వేస్తూ నాలుగవ తేదీన హయత్ నగర్ సరూర్నగర్ నూతన మండల కమిటీల సభలను విజయవంతం చేయాలని మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమ గౌరవాన్ని అస్తిత్వాన్ని నిలబెట్టేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ కమిటీల ఏర్పాటుపై దృష్టి ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని రాగళ్ల ఉపేందర్ మాదిగ సూచించారు. గ్రామ కమిటీల ఏర్పాటు విషయంలో నాయకులు నిర్లక్ష్యం వీడి వెంటనే గ్రామాల్లో పర్యటించి కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని అనుబంధ సంఘాల కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేని చదువుకున్న యువతను కమిటీల్లో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 5లోపు అన్ని గ్రామ, మండల కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసి వరంగల్ జాతీయ మహాసభకు సిద్ధం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ మాజీ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర రవీందర్ మాదిగ, జాతీయ నాయకులు భారత్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు మల్లెపూగు రాజు, హేమంత్, నరసింహారావు, బి.రాజు, క్రాంతి మాదిగ, సతీష్ మాదిగ, ఈ.చంటి, ఎం.అర్జున్, ఎం.రాజు, ఈ.ప్రశాంత్, ఈ.నాగరాజ్, ఎం.మల్లేష్, కె.లింగయ్య, ఈ.సునీల్, ఎం.వీరన్న, ఎం.వెంకటేష్, ఎం.మహేష్, పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉంది:

### మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్.

### పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని సందర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్...




**కత్బుల్లాపూర్ ఆగష్టు 19(ప్రజాజ్యోతి )** హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకుడు వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి ఎల్లమ్మబండలోని పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని పాలమూరు ముద్దు బిడ్డ, తెలంగాణ ఉద్యమకారులు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను సంఘం నిర్వాహకుల నుంచి అడిగి తెలుసుకున్నారు. తను కూకట్ పల్లి డిప్యూటీ కమిషనర్ గా పని చేసినప్పుడు ఎల్లమ్మబండ కాలనీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు గుర్తు చేశారు. పాలమూరు జిల్లా అంటేనే వలస కార్మికుల జిల్లా అని పేరుంది, ఎల్లమ్మబండతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పాలమూరు వాసులు నివాసం ఉంటున్నారని అన్నారు. హైదరాబాద్ మహానగర నిర్మాణంలో, అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు వలసలు తగ్గాయి, పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల ద్వారా పుష్కల నీటిని అందించడంతో వలస కార్మికులు వలసల బాట మాని వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. పాలమూరు బిడ్డలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ. కరీమ్, ప్రధాన కార్యదర్శి గోపాస్ రవీందర్, సీనియర్ జర్నలిస్టులు ఆర్. కే. దయాసాగర్, సామల రాము, బిఆర్ఎస్ నాయకులు డి. అనిల్ రెడ్డి, కాంట్రాక్టర్ శంకర్, సంఘం వ్యవస్థాపక సభ్యులు దేవయ్య, యాదగిరి, నరసింహ, మాచర్ల భద్రయ్య, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ వ్యవసాయంతోనే పంటలకు ఆరోగ్యం

### కేవికే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకృష్ణ

### సమగ్ర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన



**యాచారం, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** నల్లవెల్లిలో సహజ, సేంద్రీయ వ్యవసాయ, నేల ఆరోగ్యం, ఎలినినో ప్రభావం, ఆరుతడి పంటలు, పురుగుమందుల సురక్షిత వినియోగం, విత్తన శుద్ధి, సమగ్ర శస్యరక్షణ పద్ధతులపై మండల రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. సేంద్రీయ వ్యవసాయమే నేలకు పంటలకు ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. వ్యవసాయంలో సమగ్ర పద్ధతులను అవలంబించడం ద్వారా పంటలను కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని రైతులకు వివరించారు. , రైతులకు పురుగుమందులను కొనుగోలు, పిచికారి సమయంలో వినియోగం అనంతరం పాటించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఎలినినో ప్రభావం, ఆరుతడి పంటలు సాగు, వరి సాగు తగ్గించడం, కిసాన్ సారధి మొబైల్ యాప్, యాప్ డౌన్‌లోడ్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. యాచారం రైతు వేదికలో సబ్సిడీ ద్వారా కందులు పీఎస్బీ జీవన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు, శాస్త్రవేత్త డా. శ్రీకృష్ణ, వ్యవసాయ అధికారి రవినాద్, ఇతర వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రనగర్‌లో లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం





**ఉప్పల్,ఆగస్టు19,ప్రజాజ్యోతి:** రామంతపూర్ ఇంద్రనగర్ వాసుల కష్టాలకు తెరదించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ రఫీక్ రామంతపూర్ ఇంద్రనగర్‌లో ఎన్నో ఏళ్లుగా ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న లో-వోల్టేజ్ విద్యుత్ సమస్యపై బస్తీ బాట కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ రఫీక్ వెంటనే సమస్యను ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు అధికారులతో నిరంతరం మాట్లాడి, సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా కృషి చేయడంతో ఇంద్రనగర్‌లో విద్యుత్ సరఫరా మెరుగుపడి, లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.మాటలకే పరిమితం కాకుండా ప్రజా సమస్య లను గుర్తించి, పరిష్కారం చూపించ డమే మహమ్మద్ రఫీక్ నాయకత్వం ప్రజల సమస్యే తన సమస్యగా భావిస్తూ పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగిస్తానని మరోసారి నిరూపించిన మహమ్మద్ రఫీక్ మహమ్మద్ రఫీక్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామంతపూర్ డివిజన్ ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పూస సత్తయ్య చుక్క సత్యనారాయణ ఆదినారాయణ గౌడ్ గంగపుత్ర భాస్కర్ అంకాల సందీప్ ఎం డి షకీల్ పూస బాలరాజ్ పూస మల్లికార్జున్ గంగపుత్ర అశోక్ యూత్ కాంగ్రెస్ నాయకులు స్వామి ఎన్ ఎస్ యు ఐ నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు,

# రహదారుల అభివృద్ధితో ప్రజా జీవన ప్రమాణాల పెంపు : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ ఆగష్టు 19(ప్రజా జ్యోతి )** 131- కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి బాల్ రెడ్డి నగర్ లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దాదాపు 67.50 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా మౌళిక వసతుల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాల పెంపు సాధ్యమని, ప్రజలకు మౌళిక వసతులను కల్పించేందుకు గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో కూడా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ డివిజన్లలోని కాలనీలను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ భద్రు, డీఈ దుర్గా ప్రసాద్, ఏఈ అభిరామ్, వాటర్ వర్క్స్ మేనేజర్ రవి, కాలనీ అధ్యక్షులు దుర్గా రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి చారి, సాయిబాబా దేవాలయం చైర్మన్ పి. సుధాకర్ రెడ్డి, కాలనీ వాసులు పి.లింగారెడ్డి, రామారావు, కార్తీక్, వెంకటయ్య, క్రిష్ణ, ప్రసాద్, కోటి రెడ్డి, అరుణా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ ప్రెసిడెంట్ దేవరకొండ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తి రెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, ఎండి.నజీర్, నార్లకంటి బాలయ్య, రాకేష్ జాలిగం, బొంబాయి శ్రీను, రమణా రెడ్డి, మహేష్, మధుకర్ రెడ్డి, రమణా రెడ్డి, ఆంజనేయులు, కళ్లెం శ్రీనివాస్, వెంకటేష్, ఖలీల్, శ్రీనాథ్, అజయ్, నాగేష్, ప్రసాద్, దిలీప్, సెర్వి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### సిఐ సత్యనారాయణ

### తాడిపర్తిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన

### పాల్గొన్న సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్




**యాచారం, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సిఐ సత్యనారాయణ చెప్పారు. బుధవారం తాడిపర్తిలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పిఎస్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ కాల్స్ ద్వారా మెసేజ్ల ద్వారా ఆధార్, ఓటీపీలు, బ్యాంకు ఖాతా నెంబర్లు అడుగుతారని వాటి పట్ల స్పందించ వద్దని చెప్పారు. నేటి యువత ప్రధానంగా మాదకద్రవ్యాలకు లోనై అర్ధాంతరంగా తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని చెప్పారు. అత్యవసర సేవల కోసం 112 నెంబర్ కు కాల్ చేయాలని ఫైర్, పోలీస్, క్లూస్ టీమ్, అంబులెన్స్ సేవలను ఒకే చోట అందిస్తుందని ఇది ఏకైక అత్యవసర హెల్ప్ లైన్ నెంబర్ అని చెప్పారు. మాదకద్రవ్యాల సమాచారం ఎవరి దృష్టి కైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, ఎస్సై సునీల్ , పోలీసు సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# షాబాద్‌లో సీపీఐ ప్రజా చైతన్య బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికిన సీపీఐ నాయకులు

**కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేయాలి: పాలమాకుల జంగయ్య**



షాబాద్ ఆగస్టు 19( ప్రజాజ్యోతి ) షాబాద్ మండల కేంద్రంలోని బద్లావ్ జరూరీ హై.. మార్పు కావాలి" అనే నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో చేపట్టిన రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య బస్సు యాత్ర బుధవారం సాయంత్రం షాబాద్ మండల కేంద్రానికి చేరుకుంది. యాత్ర బృందానికి సీపీఐ షాబాద్ మండల సమితి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఐ జెండాను రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యులు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను ప్రభుత్వం అవలంబిస్తోందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

**ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ**

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల సమయంలో ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ అమలులోకి రాలేదని జంగయ్య విమర్శించారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు యువతకు కొత్త ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తామని ఇచ్చిన హామీని కూడా కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకింగ్ వ్యవస్థ, ఎల్ఐసీ, విమానాశ్రయాలు వంటి ప్రజా ఆస్తులను ప్రైవేటీకరించే విధానాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ శక్తుల చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ప్రజా ఆస్తులను పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

**రైతు, కార్మిక, యువత సమస్యలపై పోరాటం**

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, వ్యవసాయ రంగాన్ని పరిరక్షించడం, రైతుల రుణభారాన్ని తగ్గించడం, రైతు ఆత్మహత్యలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జంగయ్య డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం బలోపేతం కాకుండా దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు.

యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పోటీ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని, ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

**మతం, కులం పేరుతో విభజన రాజకీయాలు వద్దు**

మతం, కులం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలకు స్వస్తి పలకాలని జంగయ్య అన్నారు. ప్రజలకు అవసరమైన ఉద్యోగాలు, ఉపాధి, విద్య, వైద్యం, రైతుల సమస్యలు, ధరల పెరుగుదల వంటి అసలు సమస్యలపై రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థలను కాపాడేందుకు ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఐదు రోజుల బస్సు యాత్ర

సీపీఐ జాతీయ పార్టీ పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో ఐదు రోజుల పాటు ప్రజా చైతన్య బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని జంగయ్య తెలిపారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో ప్రజలను కలుస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

ఆగస్టు 21న అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కుంట్లూరులో ప్రజా చైతన్య యాత్ర ముగింపు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారని చెప్పారు. పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, రైతులు, కార్మికులు, పార్టీ శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు కే. రామస్వామి, బుద్ధుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, ప్రజానాట్యమండలి నాయకులు సుధాకర్, క్రాంతి, వంశీ, వర్ధన్‌రెడ్డి, షాబాద్ మండల పార్టీ కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం. సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు, కార్యకర్తలు నక్కల జంగయ్య, రొకయ్య, రాములు, వెంకటేష్, నర్సింలు, ఆనందం, పాండు, రామకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా పార్టీ కార్యకర్తలు నినాదాలతో మండల కేంద్రంలో సందడి చేశారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా కిట్ల పంపిణీ

**ఇంటర్ విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్,షూస్,బెల్టు,పంపిణీ**

**ఆనందం వ్యక్తం చేసిన కళాశాల విద్యార్థులు**

**విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలి**

**తలకొండపల్లి ఉపసర్పంచ్ నూకం కోటేశ్వర్ ముదిరాజ్**



**తలకొండపల్లి,ఆగస్టు 19: (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత ఇంటర్మీడియట్ కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది.విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం అందించిన నోట్‌బుక్స్,బెల్ట్,మరియు షూస్‌తో కూడిన ఉచిత కిట్లను ప్రజాప్రతినిధులు,నాయకులు స్వయంగా విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కోటీశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ...ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత కిట్లను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.చాలామంది విద్యార్థులు పేద కుటుంబాల నేపథ్యం నుంచి వచ్చినవారని వారి ఉజ్వల భవిష్యత్తుకు విద్య ఒక్కటే మార్గమని వారు పేర్కొన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి అవకాశాలను,ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు.ఉచిత కిట్లను అందుకున్న విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అధికారులకు,ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి చారి,మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి,గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు నాయిని లక్ష్మీకాంత్ గౌడ్,ఇటమోని వెంకటేష్ యాదవ్,మల్లీశ్వరి జంగయ్య,అలివేలు అంజయ్య,మాజీ ఉప సర్పంచ్ అనిల్ ముదిరాజ్,కళాశాల ఉపాధ్యాయులు,నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**కాంగ్రెస్ పార్టీ లో అవకాశాలు ప్రతి ఒక్కరికి వస్తాయి**

**డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**




**శామీర్ పేట్, ఆగస్టు 19,(ప్రజాజ్యోతి)** కాంగ్రెస్ పార్టీ లో అవకాశాలు ప్రతి ఒక్కరికి వస్తాయని డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. బుధవారం తుంకుంట మొగుళ్ళ వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాలు లో 300 డివిజన్ అధ్యక్షుడు నక్క సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో బి ఎల్ ఏ లకు సన్మానం, నామినేటెడ్ పోస్టుల భర్తీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.... శామీర్ పేట డివిజన్ లోని పూర్తి స్థాయి కమిటీని వేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ లో అవకాశాలు ప్రతి ఒక్కరికి వస్తాయని, నాయకులు నిరాశలకు లోనుకావద్దని తెలిపారు. నామినేటెడ్ పోస్టులల్లో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, సిస్టమ్ అనుగుణంగానే ఏ అధికారి అయినా పని చెయ్యాల్సిందేనని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసికెళ్లే బాధ్యత మీదే అన్నారు. అనంతరం సర్ ప్రక్రియలో సమర్థ వంతంగా కృషి చేసిన బి ఎల్ ఏ లను మెమెంటో లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, ముజీబ్, ఆర్టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, ఏ ఎం సి చైర్మన్ నర్సింలు యాదవ్, నాయకులు రవి, మహేష్ గౌడ్, సత్యనారాయణ, శంకర్, ఎద్దు నాగేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కార్యాలయం పరిధిలోని ఇండోర్ ఔట్డోర్ స్టేడియంలను పరిశీలించిన జోనల్ కమిషనర్

**నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశం**





**ఉప్పల్,ఆగస్టు19,ప్రజాజ్యోతి:** ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, ఐఏఎస్ ఉప్పల్ జోనల్ కార్యాలయం సమీపం లోని ఇండోర్ ఔట్‌డోర్ స్టేడియంలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేడియంలలో జరుగుతున్న మరమ్మతులు, పెయింటింగ్ ఇతర అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. పనులను మరింత వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బంది కి కాంట్రాక్టర్ ను ఆదేశించారు. స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచడంతో పాటు క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు.

# ప్రపంచ వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలి

**దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్**



**హైదరాబాద్, ఆగస్ట్ 19 (ప్రజా జ్యోతి) :** ప్రపంచ వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ మణికొండ వేదకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్‌లోని విశిష్ట మెగాలిథిక్ మెన్హిర్స్, స్టోన్ సర్కిల్స్, సమాధులను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ), తెలంగాణ వారసత్వ శాఖ, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ అధికారులు, పురావస్తు నిపుణులు సంయుక్తంగా పరిశీలించినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముడుమాల్ ఇప్పటికే యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో ఉందని, చేర్చేందుకు అధ్యయనాలు, డాక్యుమెంటేషన్ కొనసాగుతున్నాయని ఏఎస్ఐ హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా.నిహిల్ దాస్ తెలిపారు. 2, 3 వేల ఏళ్ల నాటి మెన్హిర్లు, స్టోన్ సర్కిల్స్, ఖగోళ–సూర్యగమన సంబంధాలు ఈ ప్రాంతానికి ప్రత్యేకతనిస్తున్నాయని పేర్కొన్నారు. అంబేకర్ ముడుమాల్‌ను సహజ స్వరూపానికి భంగం కలగకుండా సంరక్షించాలని ఏఎస్ఐ అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా.రోహిణి పాండే సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.కె.పి.రావు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ కోఆర్డినేటర్ ఖైజర్ భాషా, క్షేత్ర కన్సల్టెన్సీ, సంబంధిత బృందాలు, జిల్లా అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే ప్రజావాణి

**మండల స్థాయిలో సేవలు.. ప్రజా పాలనకు నిదర్శనం**

**డీసీసీ ఉపాధ్యక్షుడు పడాల రాములు**



**చేవెళ్ల ఆగస్టు 19(ప్రజా జ్యోతి):** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మండల స్థాయిలోనే ప్రజావాణి సేవలను అందుబాటులోకి తీసుకురావడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనకు నిదర్శనమని రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు పడాల రాములు అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజావాణి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 'ప్రజల కోసం ప్రభుత్వం.. ప్రజల వద్దకే పాలన' అనే లక్ష్యంతో సీఎం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని రాములు తెలిపారు. ప్రజలు ప్రజావాణి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

# కోదండ రామాలయంలో వైభవంగా శ్రీనివాస కళ్యాణం



**ఉప్పల్,ఆగస్ట్19 ప్రజాజ్యోతి:** హబ్సిగూడ స్టేట్ నంబర్ 8 కోదండ రామాలయంలో వైభవంగా శ్రీనివాస కళ్యాణం స్వామి వారి కళ్యాణాన్ని తిలకించిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు వేంకటేశ్వర మహా మంత్ర పీఠం ఆధ్వర్యం లో హబ్సిగూడ స్టేట్ నంబర్ 8 లోని శ్రీ కోదండ రామచంద్ర స్వామి కళ్యాణ మండపం లో 108వ శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కోదండ రామాలయం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి హాజరై వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని ఆద్యంతం తిలకించారు. న్నుల పండువలా సాగిన ఈ ఆధ్యాత్మిక వేడుకకు మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగిరెడ్డి డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి రొండ్ల దామోదర్ రెడ్డి, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు గణేష్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళీ కృష్ణ ముదిరాజ్, కిషన్ నాయక్, మాలు నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయం--కల్లు కాంపౌండ్ వరకు రూ.13 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**అల్వాల్ ఆగస్టు 19 ప్రజా జ్యోతి** ఓల్డ్ ఆల్వాల్ లోని రామాలయం ముందు భాగం నుంచి నాగన్న ఇంటి సమీపం మీదుగా కల్లు కాంపౌండ్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం జేసీబీతో ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి, బి. నాగేశ్వరరావు తదితరుల వినతి మేరకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు రూ.13 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అల్వాల్ సీనియర్ నాయకులు బి. నాగేశ్వరరావు, గణేష్, సుధాకర్ రెడ్డి, సాయిరాం గౌడ్, నారాయణ, ఎస్. రాజు, బి. రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామారావు, చందు తదితరులు పాల్గొని జేసీబీతో పనులను ప్రారంభించారు. రహదారి నిర్మాణం పూర్తయితే స్థానికులకు రాకపోకలకు ఇబ్బందులు తొలగి, ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని వారు తెలిపారు.

# అడవి ఆక్రమణకు యత్నిస్తే కఠిన చర్యలు

**జేసీబీ స్వాధీనం.. అటవీ అధికారుల హెచ్చరిక**



**వికారాబాద్ ప్రతినిధి ఆగస్టు 19(ప్రజా జ్యోతి):** అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాం కుమార్ హెచ్చరించారు. బార్వాద్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని కంపార్ట్‌మెంట్ నంబర్ 52లో జేసీబీతో అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో సెక్షన్ ఆఫీసర్ ఇనాయత్ అలీ, బీట్ అధికారి భీమ్లా నాయక్ వెంటనే అక్కడికి చేరుకుని జేసీబీని స్వాధీనం చేసుకుని జిల్లా ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శ్యాం కుమార్ మాట్లాడుతూ.. అటవీ భూముల పరిరక్షణకు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎవరైనా అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అక్రమంగా పనులు చేపట్టినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఆల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీపై పొల్యూషన్ కంట్రోల్ అధికారుల నిఘా

**వెల్లడించిన పొల్యూషన్ నియంత్రణ బోర్డు ఎఈ శ్రీకాంత్**





**తాండూరు ఆగస్టు 19 ప్రజా జ్యోతి :-** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్కాపూర్ గ్రామ శివారులో గల (ఐసీఎల్) ఆల్ట్రా టెక్ సిమెంట్ కంపెనీ వద్ద హైదరాబాద్ పొల్యూషన్ నియంత్రణ బోర్డు అధికారులు ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొల్యూషన్ నియంత్రణ బోర్డు ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ మల్కాపూర్ గ్రామానికి చెందిన జక్లంపల్లి కిష్టప్ప అనే వ్యక్తి వికారాబాద్ జిల్లా కలెక్టర్ కు గత రెండు వారాల క్రితం కంపెనీ ద్వారా వెలువడుతున్న దుమ్ము,దూళి కాలుష్యం కారణంగా మా ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇట్టి విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారిచేయడంతో కంపెనీ ద్వారా ఏ మేరకు పొల్యూషన్ వెలువడుతుంది అనే దానిపై బుధవారం నాడు పొల్యూషన్ కంట్రోల్ అధికారుల బృందం ద్వారా కంపెనీ సరిసరాలతో పాటు గ్రామంలోని ఓ ప్రాంతంలో ప్రత్యేక యంత్రాలచే నిఘా పెట్టామని చెప్పారు. పొల్యూషన్ నియంత్రణ తెలుసోకోవడం కోసం 24 గంటల సమయం పడుతుందని పొల్యూషన్ నియంత్రణ బోర్డు ఎ ఈ శ్రీకాంత్ వెల్లడించారు. తదుపరి ఇట్టి నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించనున్నట్లు చెప్పారు. అదేవిదంగా మంచినీటి కలుషితంపై పరిశీలన కోసం నీటిని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదు దారుడు కిష్టప్ప గ్రామ ప్రజలు ఉన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపు పాశవిక చర్య

**డా. మెతుకు ఆనంద్**




వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు19(ప్రజా జ్యోతి): మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గమైన, పాశవిక చర్య అని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తీవ్రంగా ఖండించారు. ప్రజల కోసం సేవ చేసిన నాయకుడి విగ్రహాన్ని తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. “పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని చూసి కాంగ్రెస్ నాయకులకు ఎందుకు భయం? మరణించిన నాయకుడి విగ్రహాన్ని కూడా తొలగించేంత కక్ష ఎందుకు?” అని నిలదీశారు. ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సైతం తొలగించడం వెనుక రాజకీయ కక్ష, కుట్ర ఉంటే ప్రభుత్వం వెంటనే వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని గౌరవప్రదంగా తిరిగి ఏర్పాటు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. “ప్రజల అభిమానాన్ని, నాయకుడి జ్ఞాపకాలను రాజకీయ కక్షతో చెరిపివేయడం సాధ్యం కాదు. తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారు” అని మెతుకు ఆనంద్ స్పష్టం చేశారు.

# నిరుపేదలకు వరంగా మారిన సీఎంఆర్ఎఫ్



**తలకొండపల్లి,ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని చీపునుంతల గ్రామానికి చెందిన మేడమోని రమణి ఇటీవల అనారోగ్యానికి గురై ప్రవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందారు.వైద్య సహాయం నిమిత్తం గ్రామ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సహకారంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరైంది.కల్వకుర్తి శాసనసభ్యులు,అభివృద్ధి ప్రదాత కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన ఈ సీఎంఆర్ఎఫ్ చెక్కును నాయకులతో కలిసి గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ లబ్ధిదారుడికి బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉందని,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎల్లప్పుడూ పేదలకు అండగా ఉంటారని అన్నారు.సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంగా మారిందని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి రఘుపతి,కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మాజీ ఉపసర్పంచ్ చెన్నకేశవులు,వార్డు మెంబర్లు వంకూరి శ్రీరామ్,శారద,గ్రామ నాయకులు పెంటయ్య,శ్యామ్లాల్, వెంకటయ్య,వెంకటాచారి, పెంటయ్య,గడ్డమీది యాదయ్య,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# కెమెరా కన్నుతో ప్రపంచాన్ని చూపించడమే ఫోటోగ్రఫీ కళ

**మొయినాబాద్‌లో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు**



**మొయినాబాద్, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొయినాబాద్ మండలంలోని పీకాక్ ఫోటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యూరే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు మాట్లాడుతూ.. ఒక్క ఫోటో ఎన్నో జ్ఞాపకాలను పదిలంగా ఉంచుతుందని, కాలం గడిచినా ఆ క్షణాలను కళ్లముందు నిలిపేది ఫోటోగ్రఫీ కళేనని అన్నారు. ఫోటోగ్రఫీ కేవలం చిత్రాన్ని తీయడం మాత్రమే కాదని, వెలుగు, నీడ, రంగులు, భావోద్వేగాలు, సందర్భాలను కలిపి ఒక కథను చెప్పే కళ అని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతతో ఫోటోగ్రఫీలో అనేక మార్పులు వచ్చినప్పటికీ, మంచి ఫోటోకు సృజనాత్మక దృష్టి, సరైన క్షణాన్ని గుర్తించే నైపుణ్యం, ఫోటో ఆర్ట్‌పై అవగాహన ఎంతో ముఖ్యమని తెలిపారు. ఫోటోగ్రాఫర్లు సమాజంలో జరిగే ముఖ్యమైన సంఘటనలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యతను కూడా నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీకాక్ ఫోటోగ్రఫీ యూనియన్ మండల అధ్యక్షుడు శశిధర్, వాసు, మాణిక్ రెడ్డి, విష్ణు, నరసింహ, శ్రవణ్, మధు, నాగరాజ్, నవీన్, నరేష్, రామకృష్ణ తదితర ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# తలకొండపల్లిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**తలకొండపల్లి,ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి అసోసియేషన్ సంఘం మండల అధ్యక్షులు గుద్దేటి మహేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరించి,కేక్ కటింగ్ చేసి పలువురికి అరటిపండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గుద్దేటి మహేష్ మాట్లాడుతూ...ఫోటోగ్రఫీ కళను,జ్ఞాపకాలను భద్రపరిచే ఫోటోగ్రాఫర్ల సేవలను మరువలేమని అన్నారు.ఫోటోగ్రఫీ అభివృద్ధికి లూయిస్ డాగురె చేసిన సేవలను కొనియాడారు.1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం డాగ్యురేటైప్ ప్రక్రియను ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఈ రోజును ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.వెయ్యి మాటలు చెప్పలేనిది ఒక చిత్రం చెబుతుంది” అనే నానుడి ఫోటోగ్రఫీ విశిష్టతను తెలియజేస్తుందని,కాలం గడిచినా ఒక ఛాయాచిత్రం ఆ క్షణాన్ని భవిష్యత్తు తరాలకు అందిస్తుందని పేర్కొన్నారు.హైదరాబాద్ కు చెందిన రాజా దీనదయాల్ భారతీయ ఛాయాచిత్ర చరిత్రలో చిరస్మరణీయుడని,ఆయన చిత్రీకరించిన నిజాం కాలం నాటి హైదరాబాద్ నేటికీ ప్రపంచ మ్యూజియంలలో నిలిచి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్లు శేఖర్,రాహుప్,డాన్ శ్రీను,నరసింహ,శేఖర్,సభ్యులు నగేష్,శ్రీకాంత్,తరుణ్,కృష్ణ,వేణు,మహేష్,కిరణ్,చెన్నకేశవులు,స్టిల్ శ్రీను నాయక్,శ్రీరామ్,జగన్ తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ కమిషనర్లకు ఆహ్వానం



హైదరాబాద్: ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈనెల 21,22 తేదీలలో జరిగే జాతీయ సదస్సుకు జి.హెచ్.ఎం.సి కమిషనర్ కర్ణన్, హెచ్.ఎం.డి.ఏ కమిషనర్ సర్ఫరాజ్ అహమ్మద్ ను హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి కలిసింది. బుధవారం నాడు ప్రెస్ క్లబ్స్ అఫ్ ఇండియా ఫెడరేషన్ సీ.ఈ.ఓ వివేక్ ముఖర్జీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్,జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లి బాపురావు, కోశాధికారి రమేష్ వైట్ల జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ను సత్కరించారు. ప్రెస్ క్లబ్స్ అఫ్ ఇండియా ఫెడరేషన్ జాతీయ సదస్సుకు రావాలని ఆహ్వానించారు. అనంతరం నానక్ రామ్ గూడా లోని హెచ్.ఎం.డి.ఏ కార్యాలయంలో కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లి బాపు రావు, ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ముత్యాల సత్తిబాబు తదితరులు కలిసి ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కాంక్లేవ్ కు ఆహ్వానించారు.

# హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అదృశ్యం



**మొయినాబాద్ :ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన బైకని జంగయ్య (79) సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, జంగయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో పసుపు రంగు టీషర్ట్, షార్ట్ ధరించి ఉన్నారు. అనంతరం ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, తెలిసిన వారిని సంప్రదిస్తూ జంగయ్య ఆచూకీ కోసం వెతుకుతున్నారు. పరిసర ప్రాంతాల్లో కూడా గాలించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదని తెలిపారు. జంగయ్య ఆచూకీ తెలిసిన వారు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని కోరారు. జంగయ్య ఎక్కడైనా కనిపించినా, ఆయనకు సంబంధించిన సమాచారం తెలిసినా ఆలస్యం చేయకుండా 9951871995 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపనకై సుంకిరెడ్డికి ఆహ్వానం అందజేత




**తలకొండపల్లి,ఆగస్టు 19 ప్రజాజ్యోతి:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో వెలసిన శ్రీ పోచమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సిఓఓ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి గ్రామ సర్పంచ్ దుర్గాపురం అనిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం శుభ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధికి రాఘవేందర్ రెడ్డి సహకారం ఎంతో అవసరమని,గ్రామానికి ఐక్యత ఫౌండేషన్ ద్వారా సేవలందించాలని ఆకాంక్షించారు.అలాగే పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని స్వామివారి తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి,మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్ రెడ్డి,గ్రామ నాయకులు శివాజీ,గ్రామ పెద్దలు,యువకులు తదితరులు ఉన్నారు

# ప్రభుత్వ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి

**డిప్యూటీ తహసిల్దార్ కు సిపిఎం నాయకుల వినతి**

**అక్రమ భూ కబ్జాను తీవ్రంగా ఖండిస్తున్నాం**

**హద్దుల ఏర్పాటుతో భూమిని రక్షించాలని డిమాండ్**



**యాచారం, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** మంతన్‌గౌడ్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 106 అసైన్డ్ ప్రభుత్వ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సాగర్‌కు మెమోరాండం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు చందునాయక్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి కిషన్ నాయక్, మాజీ ఎంపిటిసి తావు నాయక్ మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెట్లు తొలగించి ప్రభుత్వ భూమిని ఆక్రమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కొంతమంది భూ బకాసురులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా భూ కబ్జాలకు పాల్పడుతూ చెట్లను తొలగించి భూములు కబ్జాకు చేసుకుంటున్నారని వినతిలో ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి 106 సర్వే నెంబర్ను తక్షణమే సర్వే చేయించి హద్దులు ఏర్పాటుచేసి భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామంలో ఉన్న పేద ప్రజలను కలుపుకొని తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు రోజా నరసింహ, మాజీ వార్డ్ నెంబర్ మాన్ సింగ్, నాయకులు గణేష్, శంకర్, జంగయ్య కుమార్, తదితరులు పాల్గొన్నారు

# మహిళలకు ఉపాధి నైపుణ్యాలపై శిక్షణ

**గ్రామీణ సాంకేతికత, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన**






**చేవెళ్ల ఆగస్టు 19(ప్రజా జ్యోతి):** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేలా రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీ--పీఆర్) రూరల్ టెక్నాలజీ పార్క్‌లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఫిక్కీ ఫ్లో స్టేట్ ప్రెసిడెంట్ సీతారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపాలిటీకి చెందిన మహిళలు పాల్గొన్నారు. చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు శిక్షణకు హాజరయ్యారు. రూరల్ టెక్నాలజీ పార్క్‌లో ప్రదర్శిస్తున్న గ్రామీణ సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాంకేతిక ఆవిష్కరణలు, మహిళలకు అందుబాటులో ఉన్న వివిధ ఉపాధి అవకాశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. మహిళల సాధికారత, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనతో పాటు గ్రామీణ అభివృద్ధికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలని సూచించారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

# దయనీయ స్థితిలో కేసారం బస్టాప్

**నిర్లక్ష్యం నీడలో కేసారం**
**ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ప్రయాణికుల అవస్థలు**
**అధికారులు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**




**మోమిన్‌పేట్. ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని కేసారం గ్రామంలో బస్టాప్ పరిస్థితి దయనీయంగా మారింది. సుమారు 2,500 జనాభా కలిగిన కేసారం గ్రామంలో ప్రయాణికుల కోసం కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు కనీసం నిలువ నీడ కూడా లేకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. రోడ్డుపక్కనే నిలబడి ప్రయాణం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాప్ ఉందా.. లేక ప్రజల సహనానికి పరీక్షా? కేసారం గ్రామం నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వికారాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, తాండూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఉద్యోగాల కోసం వెళ్లేవారు, చదువుల కోసం విద్యార్థులు, వైద్య సేవల కోసం ఆసుపత్రులకు వెళ్లే రోగులు, వారి కుటుంబ సభ్యులు నిత్యం బస్సులపై ఆధారపడుతున్నారు. ఇంతటి రాకపోకలు ఉన్న గ్రామంలో ప్రయాణికులకు కనీసం ఒక సౌకర్యవంతమైన బస్టాప్ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉద్యోగం కోసం వెళ్లే వ్యక్తి ఉదయం బస్సు కోసం ఎండలో నిలబడాలి.. విద్యార్థి చదువుల కోసం వెళ్లేందుకు వర్షంలో తడవాలి.. ఆసుపత్రికి వెళ్లే రోగి కూడా రోడ్డుపక్కనే నిలబడాల్సిందేనా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రజల సమస్యలు పట్టించుకునే వారేరీ**

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు కేసరం బస్టాప్ సమస్యను ఇంతకాలం పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చి హామీలు ఇచ్చే నాయకులు.. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ఇలాంటి కనీస సౌకర్యాల సమస్యలను మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. వర్షం కురిసినప్పుడు బస్సు కోసం నిలబడేందుకు సరైన ఆశ్రయం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, రోగులు మరింత అవస్థలు పడాల్సి వస్తోంది.

**ఇకనైనా మేల్కొంటారా**

కేసరం గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నూతన బస్టాప్‌ను నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. బస్టాప్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు బెంచీలు, ఎండ--వాన నుంచి రక్షణ కల్పించే షెడ్, అవసరమైన ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే కేసరం గ్రామంలో ఒక బస్టాప్ నిర్మించేందుకు కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంత నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం? ప్రజల అవసరాలు కనిపించాలంటే మరో ఎన్ని రోజులు పడుతుంది? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కేసారం గ్రామంలో నూతన బస్టాప్ నిర్మాణానికి చర్యలు చేపట్టి ప్రయాణికుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# కస్తూర్బా పాఠశాలలో సీ టీమ్ అవగాహన కార్యక్రమం

**మహిళలు, బాలల భద్రతే మా లక్ష్యం**
**నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు**
**తాండూర్ సబ్ డివిజన్ సీ టీమ్ ఇంచార్జ్ ఏఎస్ఐ నారాయణ**
**సిబ్బంది రోహిణి**







**బషీరాబాద్, ఆగస్టు 19, ప్రజా జ్యోతి:** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలల భద్రత, నేరాల నివారణ, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య ఆదేశాల మేరకు తాండూర్ సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఏఎస్ఐ నారాయణ, సిబ్బంది రోహిణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహిళల బాలల భద్రత మా లక్ష్యం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మహిళలు బాలలపై జరుగుతున్న నేరాలు నిర్భయ చట్టం పిఓ సిఎస్ఓ ఏ సిటీ 112 డయల్, సి టీం నెంబర్ 181 ఉమెన్ సెల్ఫ్ డిస్క్, సీసీ కెమెరాలను గుడ్ టచ్ బాటచ్ బాల కార్మికుల వ్యవస్థను బాల్య వివాహ నిర్మాణం కమ్యూనిటీ పోలీసింగ్ మానవ అక్రమ రవాణా మద్యపాన నిషేధం ట్రాఫిక్ రూల్స్ బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు గంజాయి నిర్మాణ డ్రగ్స్ నిషేధం ఏ ఎన్ టి ఐ డి ఆర్ యూజీ 1908 క్రైబర్ క్రైమ్ నెంబర్ 1930, సిహెచ్ ఏ ఎల్ డి ఎల్ నే 10 98 జెండర్ ఈక్వాలిటీ జెండర్ పెన్సిటివిటీ వంటి పలు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు మంచి విలువలు క్రమశిక్షణ కలిగి ఉండాలని తెలిపారు.విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని, నేరాలకు దూరంగా ఉంటూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని పోలీసు అధికారులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రభుత్వం గుర్తించిన వరినే పండించండి

**08రకాల సన్న వరితో అధిక లాభాలు**
**ప్రభుత్వం అందించే ఐదు వందల బోనస్ కూడ పొందండి**
**మండల వ్యవసాయ అధికారి కొమరయ్య**

**తాండూరు ఆగస్టు 19 ప్రజా జ్యోతి :-** ప్రస్తుతం ఖరీప్ సీజన్ లో ప్రభుత్వం గుర్తించిన మేలురకం వరి పంటను సాగు చేసి చేస్తున్న ప్రభుత్వం ద్వారా రూ 500 రూపాయల బోనస్ పొందాలని తాండూర్ మండల వ్యవసాయ అధికారి కొమురయ్య ఒక ప్రకటనలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన 08 రకాల సన్న వరి రకాలను మాత్రమే సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన వరిని సాగు చేయడంతో కొనుగోలు కేంద్రాలలో కూడ ఈ విధమైన ఇబ్బంది ఉండద న్నారు. ఈ సన్న వరి రకాల విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు తాము కొన్న డీలర్ దగ్గర ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలన్నారు. లేదంటే పంటను అమ్ముకునే సమయంలో బోనస్ పడక పోవడం గాని లేదా వడ్లను కొనుగోలు చేయకపోవడం కానీ జరగవచ్చని సూచించారు. రైతులు తప్పనిసరిగా వరి విత్తనాలను కొన్న డీలర్ దగ్గరకు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ తీసుకొని వెళ్లి సంబంధిత వరి రకాన్ని నమోదు చేసే విధంగా రసీదు కూడా పొందాలన్నారు. అదేవిదంగా తప్పకుండ సాగు చేసే వరి పంట రకం ను ఆన్లైన్ లో నమోదు చేయలన్నారు . తమ సొంత వడ్లనే విత్తనంగా వాడిన వారు పరిశోధన కేంద్రాలలో కొన్న వారు మీ క్లస్టర్ ఏఈ వో దగ్గర ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలన్నారు.
ఇలా ఆన్లైన్ లో నమోదు చేసుకోవడానికి సెప్టెంబర్ 10 వరకు ప్రభుత్వం సమయం ఇచ్చిందన్నారు. కావున ప్రభుత్వం గుర్తించిన 08 రకం వరి వడ్లను తీసుకున్న రైతులు తప్పకుండా ఇట్టి విషయాన్ని తప్పనిసరిగా పాటించాలని కోరారు.




# పరిగి సబ్ జైలు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా

**సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించి పటిష్ట భద్రతా చర్యలపై అధికారులకు కీలక సూచనలు**

**పరిగి, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా బుధవారం పరిగి సబ్ జైలును సందర్శించి భద్రతా ఏర్పాట్లపై సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జైలులోని భద్రతా వ్యవస్థ, ఖైదీల రక్షణ, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.
జైలు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జైలులోకి అనధికారిక వస్తువులు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు పోలీసు, జైలు సిబ్బంది సమన్వయంతో వెంటనే స్పందించేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధంగా ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, లోపాలు గుర్తించిన వెంటనే వాటిని సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జైలు అధికారులు భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధులు, అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలపై జిల్లా ఎస్పీకి వివరాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ వీరేష్, పరిగి సీఐ కొండల్ రెడ్డి, పరిగి సబ్ జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, పరిగి ఎస్ఐ మోహనకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.







# నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలి

**సీఐ వెంకట్ పనితీరుకు ఎస్పీ స్నేహ మెహ్రా ప్రశంసలు**
**మోమిన్‌పేట్ సర్కిల్‌లో వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ**







**మోమిన్‌పేట్. ఆగస్టు 19 (ప్రజా జ్యోతి)** వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ మోమిన్‌పేట్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో బుధవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ల శాంతిభద్రతలు, నేరాల దర్యాప్తు, పెండింగ్ కేసులు, పోలీస్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదు, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమీక్షించారు. పోలీస్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ పట్ల సీఐ వెంకట్ పనితీరును ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా అభినందించారు. సర్కిల్ పరిధిలో పోలీసింగ్ సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తీవ్రమైన నేరాల కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలు, ప్రధాన రహదారులు, ఎంట్రీ--ఎగ్జిట్ ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు.
కార్యక్రమంలో డీఎస్పీ అంజయ్య, సీఐ వెంకట్, ఎస్సై లు భరత్ భూషణ్,రాహుఫ్,గిరి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ ఆక్రమణకు యత్నం.. జేసీబీ సీజ్.



**మోమిన్ పేట్ ఆగస్టు 19 ( ప్రజా జ్యోతి)** మోమిన్‌పేట్ మండల పరిధిలోని భార్వది రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ నం.52లో అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. వెల్చల్ గ్రామానికి చెందిన పులుగు నరసింహులు అటవీ భూమిలో పనులు చేపట్టేందుకు జేసీబీని వినియోగిస్తుండగా అటవీ అధికారులు ఫారెస్ట్ శిక్షణ ఆఫీసర్ ఇనాయత్ ఆలీ బీట్ ఆఫీసర్ భీమ్లా నాయక్ లు గుర్తించి జేసీబీని సీజ్ చేశారు. అటవీ భూముల ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీ పట్టివేత




**బషీరాబాద్ ఆగస్టు 19 ప్రజాజ్యోతి** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని పట్టుకోవడం జరిగింది ఎస్ఐ విఠల్ తెలిపిన వివరాల బుధవారం ఉదయం వీర్‌సెట్టి పల్లి వాగు నుండి బషీరాబాద్ గ్రామానికీ అక్రమంగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఈసుక తరలిస్తున్న టిప్పర్ లారీ బి ఆర్ నెంబర్ టీఎస్12యుఎ6803 ధానిని కాశింపూర్ గేట్ దగ్గారా స్వాధినపర్చుకోని పోలీస్ స్టేషన్ తారలించి డ్రైవర్ సోహెల్ తండ్రి నసీర్ గ్రామం:మాంబాపూర్ పెద్దెముల్ మండల్ పై కేసు నమోదు చేశామని బషీరాబాద్ ఎస్ఐ విఠల్ తెలిపారు.

# నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**
**జిల్లాలో 2,10,297 నో మ్యాపింగ్, అనామాలిస్ ఓటర్లకు నోటీసులు**
**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 19( ప్రజా జ్యోతి):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ముసాయిదా ఓటరు జాబితా, మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్, నోటీసుల జారీ, విచారణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నో మ్యాపింగ్, అనామలీస్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 395 మంది ఏఈఆర్‌ఓలను కేటాయించి, వారికి కొత్త లాగిన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. వికారాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దీపక్ తివారి మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 2,10,297 మంది నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేందుకు బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ అనంతరం సమన్వయంతో పనిచేసి నోటీసుల జారీ, విచారణను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, డీఆర్‌ఓ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ నేమత్ హాలి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కంజర్ల విజయక్క రాఖీ పండుగ సందడి

### పల్లె పల్లెలో అన్నదమ్ములకు రాఖీ కడుతూ ఆత్మీయ అనుబంధం





**యాలాల్ ఆగస్టు 19 ప్రజా జ్యోతి** తాండూర్ నియోజకవర్గం,యాలాల మండలం గోరెపల్లి, విశ్వనాథ్ పూర్ బానాపూర్ గ్రామంలో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ గారి రాఖీ పండుగ సందడి చేశారు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ అన్నదమ్ములకు రాఖీలు కడుతూ, రాఖీ పండుగ యొక్క గొప్పతనాన్ని, అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని విజయక్క చాటిచెబుతున్నారు.

అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకానికి ప్రతీక" అనే సందేశంతో పల్లెల్లోని ప్రతి వర్గానికి చెందిన సోదరులను ఆత్మీయంగా పలకరిస్తూ రాఖీలు కడుతున్నారు.

ఇప్పటికే శ్రీమంతాలు జనని కిట్స్ కార్యక్రమాలతో గడప గడపకు వెళ్లి గర్భిణీ మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి కుటుంబాల్లో సంతోషాన్ని పంచుతున్న విజయక్క... అదే ఆత్మీయతతో ఇప్పుడు పల్లె పల్లెనా అన్నదమ్ములకు రాఖీ కడుతూ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తున్నారు. గ్రామాల్లో విజయక్కకు లభిస్తున్న అపూర్వమైన ఆదరణ, అన్నదమ్ములు ఆప్యాయంగా రాఖీలు కట్టించుకుంటూ చూపిస్తున్న అభిమానంతో రాఖీ సంబరాలు ఒక పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ప్రజలతో కేవలం కార్యక్రమాలకే పరిమితం కాకుండా... వారి కుటుంబాల్లో ఒక సభ్యురాలిగా, ఆడపడుచుగా కలిసిపోతూ సేవ చేయడమే విజయక్క ప్రత్యేకత అని స్థానికులు పేర్కొంటున్నారు.

పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా కలుపుకుంటూ "తాండూర్ కుటుంబం మనందరి కుటుంబం" అనే భావనను ముందుకు తీసుకెళ్తున్న విజయక్క రాఖీ పండుగ కార్యక్రమాలు నియోజకవర్గంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కంజర్ల విజయలక్ష్మి యాదవ్ గారు కొనసాగిస్తున్న ఈ ఆత్మీయ రాఖీ సంబరాలు తాండూర్ పల్లెల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారాయి. ఈ కార్యక్రమంలో గొరైపల్లి సర్పంచ్ లక్ష్మీ మల్లేష్ ఉప జిల్లా మాజీ కోషన్స్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా ప్రకాష్ గౌడ్, అనిల్ గౌడ్, జగదీష్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పట్టాదారుకు నష్టం జరిగితే ఊరుకోం

### చెంగోల్ గ్రామంలో 11 ఎకరాల 8 గుంటల భూమి పట్టా నిలిపివేయాలి

### తాండూర్ తాహాసిల్దార్ పై జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తాం

### జనసత్తా వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు సూరజ్ సింగ్ ఠాగూర్

**తాండూరు ఆగస్టు 19 ప్రజా జ్యోతి :-** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం చెందిన ఓ రైతుకు చెందిన 11 ఎకరాల ఎనిమిది గుంటల పట్టా భూమిని రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇతర వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసే అధిక ప్రోత్సహించారని జనసత్తా వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు సూరజ్ సింగ్ ఠాగూర్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు మండలం చెంగోల్ గ్రామ రెవిన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 200,212,141,142,143 లో గల భూమి మొత్తం 11 ఎకరాల 8 గుంటల భూమిని అసలైన పట్టాదారుకు కాకుండా నకిలీ పత్రాలు సమర్పించిన వ్యక్తులకు పట్టా చేసేందుకు తాండూర్ తాహాసిల్దార్ తార సింగ్ సహకరించినట్లు ఆయన ఆరోపించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని 111,135, సర్వేనెంబర్ లోని ప్రభుత్వ భూమితో పాటు ఎవాక్యూ ప్రాపర్టీని కూడ రక్షించలేకపోయారని విమర్శించారు. ఇట్టి విషయంపై సిసిఎల్ఎ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు.

**తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ ఎలా చేస్తాం**

**తాండూర్ తాసిల్దార్ తారా సింగ్**

తాండూరు మండలం చెంగోల్ గ్రామంలోని సర్వేనెంబర్ 200, 212,141,142,143 లో గల భూమి మొత్తం 11 ఎకరాల ఎనిమిది గంటల భూమికి సంబంధించిన అసలైన పట్టాదారు ఏ మాత్రం ఇప్పటివరకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ తానే అసలైన పట్టాదారును అని రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన సమయంలో విచారణ చెయ్యగా తప్పుడు పత్రాలుగా నిర్ధారించి అట్టి పట్టా రిజిస్ట్రేషన్ నిలిపి వేశామని చెప్పారు. మరికొందరు వ్యక్తులు



తాము అగ్రిమెంట్ హోల్డర్ల మని ఫిర్యాదు కూడా చేసినట్లు చెప్పారు. ఏది ఏమైనా శాఖపరమైన నివేదిక ఆధారంగానే అసలైన పట్టాదారుకు మాత్రమే అట్టి భూమి చెందుతుందని చెప్పారు.

# అమెజాన్ సహకారంతో పెద్దవీడు గ్రామంలో విద్యాభివృద్ధికి బాటలు

### పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య మధుసూదన్ రెడ్డి

### గ్రామ సర్పంచ్ చక్కటి రాజసులోచన,



**షాబాద్ ఆగస్టు 19 సూర్య (ప్రజాజ్యోతి )** షాబాద్ మండల కేంద్రంలోని పెద్దవీడు గ్రామపంచాయతీలో విద్యా రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అమెజాన్ సంస్థ తరఫున పాఠశాల భవనం, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, గుడిమల్కాపూర్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, అమెజాన్ ప్రతినిధులు అవినాష్, తాతాజీ, గ్రామ సర్పంచ్ చక్కటి రాజసులోచన, ఉప నాయక్ రవి నాయక్, ఎంఈఓ లక్ష్మణ్, ఎంపీడీవో అపర్ణ తదితరులు పాల్గొని భవనాల ఏర్పాటుపై చర్చించారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఆటస్థలం వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. అంగన్వాడీ భవనం ద్వారా చిన్నారులకు ప్రీ-స్కూల్ విద్య, పోషకాహారం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపారు. అమెజాన్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా విద్యా రంగానికి అందిస్తున్న సహకారం అభినందనీయమని స్థానిక నాయకులు కొనియాడారు. పాఠశాల అభివృద్ధితో పాటు డిజిటల్ విద్య, గ్రంథాలయ సదుపాయాలు, విద్యార్థులకు అవసరమైన ఇతర మౌలిక వసతుల కల్పనకు కూడా సంస్థ సహకారం అందించాలని కోరారు. పెద్దవీడు గ్రామంలో పాఠశాల, అంగన్వాడీ భవనాల ఏర్పాటు వల్ల విద్యార్థులు, చిన్నారులకు మెరుగైన వాతావరణం లభించడంతో పాటు గ్రామ విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రైవేటు సంస్థలు కలిసి పనిచేయడం ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు.

## అయ్యప్ప సొసైటీలో సైబర్ అవగాహన కార్యక్రమం

### హాజరైన కూకట్‌పల్లి డిసిపి రితి రాజ్ ఐపీఎస్





**శేరిలింగంపల్లి,ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** తెలంగాణ పోలీసులు ప్రారంభించిన సురక్ష క తిరంగ, సైబర్ స్వతంత్ర తెలంగాణ దిశగా నెల రోజుల సైబర్ అవగాహన ప్రచారంలో భాగంగా, అయ్యప్ప సొసైటీలో సుమారు 800 మంది పిల్లలు యువత పాల్గొనడంతో సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.డీసీపీ కూకట్‌పల్లి, కార్యక్రమానికి రితిరాజ్ ఐపీఎస్ హాజరై ప్రసంగించారు. పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పు గురించి పాల్గొనేవారికి ఆమె అవగాహన కల్పించారు.డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్త,అప్రమత్తత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.ఓటిపి మోసాలు, ఫిషింగ్ లింక్‌లు,నకిలీ పెట్టుబడి,ఉద్యోగ ఆఫర్‌లు,వంచన,ఇతర ఆన్‌లైన్ స్కామ్‌లతో సహా వివిధ సైబర్ మోసాలకు వ్యతిరేకంగా డిసిపి పాల్గొనేవారిని హెచ్చరించింది.ఓటిపి లు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని లేదా ధృవీకరించని సందేశాలకు ప్రతిస్పందించవద్దని ఆమె వారికి సలహా ఇచ్చింది.డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల యొక్క సురక్షితమైన, బాధ్యతాయుతమైన ఉపయోగం గురించి వారి కుటుంబాలు,స్నేహితులు,కమ్యూనిటీలకు అవగాహన కల్పించడం ద్వారా సైబర్ సేఫ్టీ అంబాసిడర్‌లుగా వ్యవహరించాలని ఆమె యువతను మరింత ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో ఉత్సాహం నెలకొంది.

## మత్తు తో జీవితాలు చిత్తు

### అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం



**కొడంగల్ ఆగస్టు 19 ప్రజా జ్యోతి న్యూస్ :** కొడంగల్ మండలము అంగడి రాయచూరు గ్రామపంచాయతీలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో విద్యార్థులకు అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అమ్మ నాన్న ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పానీయాలు, మత్తుమందు, ధూమపానం సిగరెట్లు, జరదా గుట్కా లకు చాలా దూరంగా ఉండాలని వాటితో జీవితాలు చిద్రమవుతాయని , మత్తుతో జీవితాలు చిత్తవుతాయని మత్తు వలన కలిగే నష్టాలను విద్యార్థులకు విడమర్చి చెబుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఎడల గురువుల ఎడల సంస్కారవంతంగా నడుచుకోవాలని క్రమశిక్షణతో విద్యను మంచిగా నేర్చుకొని రానున్న కాలంలో తమ కాళ్లపైన తాము నిలబడటమే కాకుండా ఒకరికి చేయూత ఇచ్చుకుంటూ తల్లిదండ్రులతో, కుటుంబంలోని వారితో సఖ్యతగా ఉంటూ ప్రేమ ఆప్యాయతలతో జీవితం గ డుపుకుంటూ సమాజ మునకు గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలని ఎంతోమందికి ఆదర్శవంతుడిగా నిలవాలని విద్యార్థులకు విడమర్చి తెలిపారు. కార్యక్రమంలో జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు అమ్మ నాన్న ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ చంద్రప్ప, మరియు గ్రామ పెద్దలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

## కులకచర్ల ప్రభుత్వం ఆస్పత్రిలో ధోబి పోస్ట్ కల్పించాలి

### జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్



**కుల్కచర్ల మండలం (ప్రజా జ్యోతి )**ఆగస్టు 19 కులకచర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి సందర్శించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి డిఎంహెచ్వో మెడికల్ ఆఫీసర్ దృష్టికి వార్డ్ మెంబెర్ రజక సంగం జిల్లా ప్రధాన కారదర్శి మోత్కూర్ వెంకటేష్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆసుపత్రిలో పనిచేస్తున్న దోబీ వర్కర్ సత్యమ్మ 1996 నుండి హాస్పిటల్లో ఆస్పత్రిలో ఆపరేషన్లు డెలివరీలు బెడ్ సీట్లు అయిన వారి యొక్క బట్టలు ఉతకడం జరుగుతుంది అని చాలా సంవత్సరాల నుంచి పని చేస్తున్న నెలకు 500 రూపాయలు ఇవ్వడం జరుగుతుంది అని ఇప్పటికైనా కంటిజెన్సీ ద్వారా పర్మినెంట్గా ఒక ధోబి పోస్ట్ కల్పించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎంపీడీఓ జిల్లా అధికారులు నాయకులు గ్రామ సర్పంచ్ వర్వాళ్ళ అంజిలయ్య మొదలగు వాళ్ళు పాల్గొనడం జరిగింది

## షాబాద్ లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

### షాబాద్‌లో లూయిస్ డాగ్యురేకు ఘన నివాళులు.



**షాబాద్ ఆగస్టు 19 (ప్రజాజ్యోతి )** మండల కేంద్రంలో ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివలింగం గౌడ్, షాబాద్ మండల అధ్యక్షుడు మల్లేశ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఫోటోగ్రఫీ రంగానికి విశేష సేవలందించిన లూయిస్ డాగ్యురేకు ఘన నివాళు లు అర్పించారు. 1839 ఆగస్టు 19న ఫ్రెంచ్ ప్రభుత్వం డాగ్యురోటైప్ ఫోటోగ్రఫీ విధానాన్ని ప్రపంచానికి అధికారికంగా పరిచయం చేసిన రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాది ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మాటల్లో చెప్పలేని భావాలను, చరిత్రలోని కీలక ఘట్టాలను ఒక్క చిత్రంతో ప్రజల ముందుంచడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు. సమాజంలో జరిగే సంఘటనలను దృశ్యరూపంలో ప్రజలకు చేరవేయడంతో పాటు, విలువైన జ్ఞాపకాలను భద్రపరచడంలో ఫోటోగ్రఫీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రజా సమస్యలు, సామాజిక అంశాలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్లు చేస్తున్న సేవలను వారు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు శేఖర్, శ్రీధర్ రెడ్డి, దేవేందర్, లక్ష్మణ్, రవీందర్, వెంకటేష్, మహేశ్, మహేందర్, అంబేద్కర్, శ్రీశైలం, ప్రసాద్ తదితరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఆటో డ్రైవర్ల యూనియన్



**తలకొండపల్లి,ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** తలకొండపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆటో యూనియన్ కు చెందిన ఆటో డ్రైవర్ పోతుగంటి జంగయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న యూనియన్ డ్రైవర్లందరూ కలిసి మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు.మానవతా దృక్పథంతో యూనియన్ సభ్యులు అందరూ చందాలు వేసి రూ. 10,000 నగదును సేకరించి బుధవారం జంగయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ...మనతో పాటు మన మిత్రుడు జంగయ్య కుటుంబానికి ఈ కష్ట సమయంలో ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో అండగా ఉంటామన్నారు.ఆటో నడిపి వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకునే జంగయ్య లేకపోవడంతో వారి కుటుంబం ఇబ్బందులు పడుతుందని,అందుకే మా వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందిస్తున్నాము అని తెలిపారు.ఆటో డ్రైవర్ల ఐక్యతకు,సహాయ గుణానికి గ్రామస్తులు,ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.కష్టంలో ఉన్న వారికి ఇలా అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు,కార్యదర్శి,సభ్యులు,సీనియర్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్‌లో మణపురం ఫైనాన్స్ నూతన శాఖ ప్రారంభం



**అల్వాల్, ఆగస్టు 19 ప్రజా జ్యోతి** మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందడంతో పాటు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని అల్వాల్ మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అల్వాల్ పట్టణ పరిధిలోని వెంకటరమణ కాలనీ, లయోలా కాలేజీ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మణపురం ఫైనాన్స్ బ్రాంచ్‌ను మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిజినెస్ హెడ్ జోషీ వి.కె., ఫీల్డ్ జోనల్ మేనేజర్లు చక్రధర్, టి. మోహన్ రెడ్డి, రీజినల్ మేనేజర్ రోహిత్ పర్సోడియా, ఏరియా హెడ్ ఏ. జగన్, బ్రాంచ్ హెడ్ మహేందర్, అసిస్టెంట్ బ్రాంచ్ హెడ్ మంజుల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 13 రోజులుగా నిరసన..అయినా పట్టించుకోని అధికారులు

అక్రమ పట్టా రద్దు చేయాలని వెల్జాల్ లో ఆందోళన ఉధృతం

న్యాయం చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం : అంబేద్కర్ సంఘం హెచ్చరిక




**తలకొండపల్లి,ఆగస్టు 19: (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో భూమి అక్రమ పట్టా వ్యవహారం 13 రోజులు దాటినా అధికారులు స్పందించకపోవడంతో గ్రామ ప్రజల ఆగ్రహం వ్యక్తం చేశారు.బాధితురాలు ఆయిల్ బొజ్జమ్మ దీక్షకు వెల్జాల్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బుధవారం మద్దతు ప్రకటించారు.బొజ్జమ్మ ఆవేదన వ్యక్తం చేస్తూ,తన వారసుల కోసం శేఖర్ గౌడ్,రవి గౌడ్ లకు సాగు కోసం ఇచ్చిన భూమిని కొందరు ప్రభావితులు కుమ్మక్కై అక్రమంగా తమ పేరిట పట్టా చేయించుకున్నారని ఆరోపించారు.మాకు న్యాయం చేయకపోతే ప్రాణాలు తీసుకుంటామంటూ కన్నీరు పెట్టుకున్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుల్తాన్ మాట్లాడారు...అక్రమ పట్టాను వెంటనే రద్దు చేసి బాధితుల పేరిట నమోదు చేయాలని కోరారు.అధికారులు నిర్లక్ష్యం వహిస్తే గ్రామ ప్రజలతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు అని హెచ్చరించారు.భవిష్యత్తులో ఎవరికైనా ఇలాంటి అన్యాయం జరిగితే ఎదురు నిలుస్తామని స్పష్టం చేశారు.ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్,బొమ్మ శంకరయ్య,యాదయ్య గౌడ్,తిరుపతి,మైసయ్య, వెంకటయ్య,నరసింహ,శ్రీను,రవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపాల్ రెడ్డి కొత్త పార్టీనా.. కాంగ్రెస్ పై తిరుగుబాటా

**నల్గొండ :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు మరోసారి పెద్ద దుమారాన్నే రేపాయి. బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైంది , రాజకీయాలను మార్చే శక్తి నాకుంది అంటూ ఆయన చేసిన కామెంట్లు, కొత్త పార్టీ పెడతారా లేక స్వపక్షంపైనే తిరుగుబాటా అనే ఉత్కంఠను రేకెత్తించాయి. కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా జెండా మోసిన అసలైన కాంగ్రెస్ నాయకులను, తెలంగాణ ఉద్యమకారులను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కీలక పదవులు కట్టబెడుతున్నారని రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యంగా సీమాంధ్ర కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో ప్రభుత్వం నడుస్తోందని ఆయన వ్యాఖ్యానించడం నేరుగా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రశ్నించడమే. కేబినెట్ విస్తరణ ఆలస్యం కావడం, తన

# నిరుపేద ఇంటి నిర్మాణానికి స్టీల్,సిమెంట్ అందజేత



**తలకొండపల్లి,ఆగస్టు 19: (ప్రజాజ్యోతి)** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పూర్తి ఇండ్లు,అసంపూర్తి ఇండ్ల నిర్మాణంలో భాగంగా జూలపల్లి గ్రామానికి చెందిన జిల్లెల్ల నాగయ్య ఇంటి నిర్మాణానికి రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్,మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తమ చారిటబుల్ ట్రస్టు ద్వారా నాగయ్య ఇంటి నిర్మాణంలో భాగంగా బుధవారం పూర్తి స్లాబ్ పనుల నిమిత్తం స్టీల్,సిమెంట్ అందజేశారు.ఈ సందర్భంగా నాగయ్య కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కు ధన్యవాదాలు తెలిపారు.నిరుపేదలకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి,ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాడ్‌బండ్ ఆలయంలో వరుణ్ సందేశ్ దంపతుల ప్రత్యేక పూజలు



**బోయిన్ పల్లి, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):** సినీ నటుడు వరుణ్ సందేశ్, ఆయన సతీమణి లావణ్య త్రిపాఠి బుధవారం తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వరుణ్ సందేశ్ గురువు ఆజ్ఞ మేరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ.. ఎంతో మహిమగల వీరాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆంజనేయ స్వామి ఆలయంలో తన భార్య లావణ్య త్రిపాఠితో కలిసి స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు.ఆలయ ఈఓ నరేందర్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు వరుణ్ సందేశ్ దంపతులను సాదరంగా ఆహ్వానించి శాలువాతో సన్మానించారు.సినీ నటులను చూసేందుకు ఆలయం వెలుపల అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వారితో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఆసక్తి చూపడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది.

## తెలంగాణలో నిరుద్యోగులకు ఊరట వయోపరిమితి రెండేళ్లు పెంపు!

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో యూనిఫామ్ ధరించి సమాజానికి సేవ చేయాలనే లక్షల మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయంతో భారీ ఊరటనిచ్చింది. గత కొంతకాలంగా నోటిఫికేషన్ల ఆలస్యం, కరోనా తదనంతర పరిణామాల వల్ల వయసు మించిపోయి ఆందోళన చెందుతున్న అభ్యర్థుల విన్నపాలను ప్రభుత్వం సానుకూలంగా మన్నించింది. ఈ క్రమంలోనే వివిధ యూనిఫామ్ సర్వీసెస్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని అదనంగా మరో రెండేళ్లు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవో నెంబర్ 122 ప్రకారం రాష్ట్రంలోని ఏడు ప్రధాన యూనిఫామ్ శాఖల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు లభించనుంది. ఇప్పటికే మే 18, 2026 నుంచి ప్రభుత్వం ఐదేళ్ల వయోపరిమితి పెంపును అమలు చేస్తోంది. ఇప్పుడు దానికి అదనంగా మరో రెండేళ్లు జోడించడంతో అభ్యర్థులకు లభించే మొత్తం వయోసడలింపు ఏకంగా 7ఏళ్లు చేరింది. దీని వల్ల వయసు పైబడి పోటీకి దూరమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు మళ్లీ ప్రాణం పోసినట్టు అయ్యింది.ఈ వయోపరిమితి పెంపు వర్తించే ప్రధాన శాఖలు ఏంటంటే... తెలంగాణ పోలీస్ శాఖ అయిన సివిల్ ఎస్ఐ కానిస్టేబుల్, ఏఆర్, టీఎస్ఎస్పీ , కమ్యూనికేషన్స్ పోస్టులకు వర్తిస్తుంది. అగ్నిమాపక శాఖలోని ఫైర్‌మెన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్ పోస్టులకు ఇది అమలు అవుతుంది. జైళ్ల శాఖ డిప్యూటీ జైలర్, వార్డర్ పోస్టుల్లో వర్తింపజేస్తారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్ శాఖ, రవాణా శాఖ, అటవీ శాఖలోని ఉద్యోగాలకు కూడా వర్తింపజేస్తారు.

**ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది?**

ఈ వయోపరిమితి పెంపు నిర్ణయం కేవలం భవిష్యత్‌లో వచ్చే నోటిఫికేషన్లకే పరిమితం కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పోలీస్ నియామక ప్రక్రియకు కూడా ఈ ఏడేళ్ల సడలింపు వర్తిస్తుందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. దీంతో ఇప్పటికే అప్లై చేయలేకపోయిన అభ్యర్థులకు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి అవకాశం కల్పించే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో సామాన్య కేటగిరీ అభ్యర్థులతోపాటు రిజర్వేషన్ వర్గాల వారికి కూడా గరిష్ట వయస్సు గణనీయంగా పెరిగింది.

| ఉద్యోగ హోదా | బేసిక్ వయోపరిమితి | పాత సడలింపు | కొత్త సడలింపుతో కలిపి ఎంత | కొత్త గరిష్ట అర్హత వయసు |
|---|---|---|---|---|
| పోలీస్ కానిస్టేబుల్ | 22 ఏళ్లు | 27 ఏళ్లు+7 ఏళ్లు | 29 ఏళ్లు | |
| సబ్‌ఇన్స్‌పెక్టర్ | 25 ఏళ్లు | 30 ఏళ్లు | +7ఏళ్లు | 32 ఏళ్లు |
| ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ | 31 ఏళ్లు | 36 ఏళ్లు | +7ఏళ్లు | 38 ఏళ్లు |

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పై పేర్కొన్న ఏడేళ్ల సడలింపుతోపాటు వారి కేటగిరీకి వర్తించే అదనపు 5 ఏళ్ల మినహాయింపు కూడా అందుబాటులో ఉంటుంది. దీని వల్ల రిజర్వేషన్ అభ్యర్థులకు కానిస్టేబుల్ పోస్టులకు గరిష్టంగా 34 ఏళ్ల వరకు, ఎస్ పోస్టులకు 37 ఏళ్ల వరకు పోటీ పడే అవకాశం లభిస్తుంది.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి ఎంపిక ప్రక్రియ

**గోదావరిఖని :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖనిలో ఈ రోజు మొదటి సంవత్సరానికి గాను ఎన్సిసి (ఔఅఅ )ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 23 ఖాళీలకు గాను 45 మంది విద్యార్థులు పోటీ పడగ 11 మంది అమ్మాయిలు మరియు 12 మంది అబ్బాయిలు ఎంపిక అయ్యారు. ఎంపిక ప్రక్రియను కళాశాల ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ భూక్యా తిరుపతి మరియు 9 తెలంగాణ బెటాలియన్ సుబేదార్ రమేష్ థాపా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జై కిషన్ ఓఝా మాట్లాడుతూ ఎన్సిసి లో చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్సిసి వల్ల క్రమశిక్షణ మరియు సమయపాలన అలవడుతుందని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయి చేరుకోవడానికి ఎన్సిసి తోడ్పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# సమానత్వ బాటలో సంత్ రవిదాస్ ఆశయాలు



**అల్వాల్ ఆగస్టు 19 ప్రజా జ్యోతి** సమాజంలో సమానత్వానికి ప్రతీకగా సంత్ గురు రవిదాస్ నిలిచారని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్‌లో ఈ నెల 22న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ‘కలశ్ వందన్ అభియాన్’ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బీజేపీ శ్రేణులతో కలిసి ఆయన విడుదల చేశారు.ఈ సందర్భంగా గిరివర్ధన్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ చూపిన మార్గం ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. సమాజంలో సమానత్వం, సామాజిక చైతన్యం పెంపొందించే విధంగా ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నెల 22న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే ‘కలశ్ వందన్ అభియాన్’ కార్యక్రమానికి మేడ్చల్ అర్బన్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు, సంత్ రవిదాస్ భక్తులు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు, సంత్ రవిదాస్ జయంతి ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ కె. సుధాకర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సురేఖ, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పద్మిని, ఉత్సవ కమిటీ కో-కన్వీనర్ నవీన్, రాజ్‌కుమార్, వనమాల, బీజేపీ సీనియర్ నాయకులు పద్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి

మండల వ్యవసాయ అధికారి విజయ చంద్ర



**షాబాద్ ఆగస్టు 19 (ప్రజాజ్యోతి )** షాబాద ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర తెలిపారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్.పి.ఎల్ ఆధారిత రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటలో సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలని, సిఫారసు చేసిన మోతాదుకు మించి కాంప్లెక్స్ ఎరువులు వినియోగించవద్దని సూచించారు. వరి పంటలో పిలక దశలో ఎరువుల యాజమాన్యంతో పాటు జింక్ లోపం, అగ్గితెగులు, ఆకుమచ్చ వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం వంటి సహజ ద్రావణాలను ఉపయోగించడం ద్వారా నేల సారం పెంచుకోవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గి రైతులకు లాభాలు పెరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శివతేజ, మౌనిక, రాజేశ్వరి, బాబ్య నాయక్, శైలజ, శివకుమార్‌తో పాటు రైతులు సత్యనారాయణరెడ్డి, మాధవి, మమత, లింగాల సత్యం, శివకుమార్, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కౌకూర్ ప్రధాన జంక్షన్ అభివృద్ధికి చర్యలు



**అల్వాల్ ఆగస్టు 19 ప్రజా జ్యోతి** కౌకూర్ బస్‌స్టాప్ వద్ద ప్రధాన జంక్షన్ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు నాయకత్వంలో 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లను మార్పిడి చేసి, విద్యుత్ స్తంభాల అడ్డంకులు లేకుండా జంక్షన్‌ను అభివృద్ధి చేసేందుకు చేపడుతున్న పనులను బుధవారం పరిశీలించారు.విద్యుత్ లైన్ల మార్పిడి, జంక్షన్ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. కౌకూర్ అభివృద్ధికి మైనంపల్లి హనుమంత్‌రావు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కౌకూర్‌ను మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యాప్రాల్ డివిజన్ జనరల్ సెక్రటరీ శివరాజ్, యూత్ లీడర్ రాజ్‌కుమార్, సత్తి తదితరులు పాల్గొన్నారు.

# హరితహారం కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయి బాబా



**శేరిలింగంపల్లి,ఆగస్టు19 (ప్రజాజ్యోతి):** హరితహారం ప్రోగ్రాం కింద బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మదినగూడ డివిజన్లోని మల్లన్న గుడి వద్ద ఏర్పాటు చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమం 50 పూల మొక్కలు నాటడం జరిగింది ఇట్టి కార్యక్రమం ప్రతి బుధవారం జరుగుతుందని నిర్వాహకుడు మిద్దెల మల్లారెడ్డి తెలియజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమము నిర్వాహకులు జనార్ధన్ గౌడ్ మిద్దెల మల్లారెడ్డి గంగారం సంగారెడ్డి షేక్ జమీర్ తిరుపతి రెడ్డి శేఖర్ గౌడ్ రామకృష్ణ గౌడ్ సాబెర్ యమాలవలస రాజు ఇట్టి కార్యక్రమం విజయవంతం చేయడానికి వచ్చిన ముఖ్య అతిథులు కోమిరిశెట్టి శెట్టి సాయిబాబా మాధవరం రంగారావు బొబ్బ నవత రెడ్డి విజయ రెడ్డి పార్నంది శ్రీకాంత్ శివరాజ్ డాక్టర్ సుదర్శన్ అల్లావుద్దీన్ పటేల్ బీరప్ప సంకటి స్వామి చందర్రావు అనంత్ రెడ్డి గౌస్ గంగారాం సందీప్ రెడ్డి గంగారాం సునీల్ రెడ్డి ఇట్టి కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసిన మిద్దెల మల్లారెడ్డి కి జై తెలంగాణ జై జై తెలంగాణ అని తెలిపారు.